RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD

సంపుటి : 10 సంచిక : 241 ఆదివారం 30 - 03 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

# 100 మంది వచ్చినా

## ఆ బిల్లు ఆగదు



- త్వరలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందుతుంది
- ముస్లిం సమాజం, మేధావులు ఈ బిల్లుకు మద్దతు తెలుపుతారు
- ఈ బిల్లును మతం కోణంలో చూడవద్దని విజ్ఞప్తి

ఒవైసీ వంటి వారు వంద మంది వచ్చినా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఆపలేరని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఒవైసీ తాత వచ్చినా ఈ బిల్లు ఆగదని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని ముస్లిం సమాజం, మేధావులు వక్ఫ్ బోర్డు బిల్లుకు మద్దతు తెలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఒక్క ఒవైసీ వస్తే బిల్లు ఆగుతుందా అని ఆయన ప్రశ్నించారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తీసుకువస్తామని చెప్పినప్పుడు తనకు కరీంనగర్‌లోని పేదవాడు గుర్తుకు వచ్చాడని ఆయన అన్నారు.కరీంనగర్ జిల్లా కోర్టు కాంప్లెక్సులోని న్యాయవాదుల డిజిటల్ లైబ్రరీ కోసం కేంద్ర సహాయ మంత్రి రూ. 15 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఆయనను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ, వక్ఫ్ బోర్డు బిల్లుపై మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. అతి త్వరలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందుతుందని ఆయన వ్యాఖ్యానించారు.ఈ బిల్లును మతపరమైన కోణంలో చూడటం సరికాదని బండి సంజయ్ అన్నారు. దేశం కోసం, ప్రజల కోసం మోదీ ప్రభుత్వం మరిన్ని కఠినమైన

- మిగతా 2 లో

# ఒక్క సంతకంతో

## ఆ పని చేస్తా...




- ★ సీఎం రేవంత్ హాట్ కామెంట్స్
- ★ ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయి
- ★ మీరు వెళ్లి ఎవరినో అడగాల్సిన పని లేదు
- ★ కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- ★ కొడంగల్‌లో ముస్లింల అభివృద్ధికి.. ఎమ్మెల్యే నిధుల నుంచి 25శాతం మంజూరు

# మనమంతా టీడీపీ వారసులం

# పెత్తందారులం కాదు

- టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న చంద్రబాబు
- పార్టీనే ప్రాణంగా బతికే పసుపు సైన్యానికి మనస్ఫూర్తిగా పాదాభివందనం చేస్తున్నానని వ్యాఖ్య
- పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో సంక్షోభాలు ఎదురైనా తెలుగుదేశం ఎన్నడూ వెన్నుచూపలేదు
- తెలుగుదేశం వారసత్వాన్ని భావితరాలకు అందించాలి
- ప్రతీ కులానికి న్యాయం చేసే పార్టీ తెలుగుదేశం పార్టీ



పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో సంక్షోభాలు ఎదురైనా తెలుగుదేశం ఎన్నడూ వెన్నుచూపలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 43 ఏళ్లుగా సంక్షోభాలను అవకాశాలుగా మార్చుకుంటూ

- మిగతా 2 లో

# పార్టీ మాకు

# కన్నతల్లి వంటిది

- దిల్లీలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నివాసంలో టీడీపీ ఆవిర్భావ వేడుకలు
- ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశం పార్టీ
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు






# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- 17మంది నక్సల్ హతం!
- ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు
- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు మరోసారి గట్టి ఎదురుదెబ్బ
- ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు స్వాధీనం
- మృతిలో 11మంది మహిళలు సహా రూ.25లక్షల రివార్డు ఉన్న ఒక వ్యక్తి ఉన్నట్లు అధికారుల గుర్తింపు
- ఛత్తీస్‌గఢ్‌లోనే ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్‌లలో 132 మంది మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 17 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో 11మంది మహిళలు సహా రూ.25లక్షల రివార్డు ఉన్న ఒక వ్యక్తి ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డట్లు చెప్పారు. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.అంతకుముందు, సుక్మాలో జరిగిన ఆపరేషన్‌లో భద్రతా సంస్థలు 16 మంది నక్సలైట్లను మట్టుబెట్టాయని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఎక్స్ మాధ్యమంలో పోస్ట్ చేశారు. ఆయుధాలు మార్పును తీసుకురాలేవని, కేవలం శాంతి, అభివృద్ధితోనే మార్పు సాధ్యమని హితవు పలికారు. అనంతరం మరో నక్సలైట్? కూడా మృతిచెందినట్లు అధికారులు అప్డేట్ ఇచ్చారు.స్థానిక గోగుండా కొండపై మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారంతో శుక్రవారం పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. శనివారం ఉదయం కూడా సెర్చ్ ఆపరేషన్? కొనసాగుతుండగా కెర్లపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టులు కాల్పులకు దిగారు. ఈ క్రమంలోనే ఎదురుకాల్పులు జరిపిన పోలీసులు 16 మందిని హతమార్చారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్‌గార్డ్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇరువర్గాల మధ్య కాల్పులు

- మిగతా 2 లో

# బాబోయ్.. మయన్మార్‌లో మళ్లీ భూకంపం....

- ఇప్పటికే వందలాది మంది ప్రాణాలు కోల్పోగా.. వేలాది మంది తీవ్ర గాయాలు
- ఓవైపు సహాయక చర్యలు కొనసాగుతుండగానే.. మరోసారి భూకంపం
- భూకంపం ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మయన్మార్ ప్రజలకు భారత్ అండ



## మొదటిపేజీ తరువాయి

# 100 మంది వచ్చినా ఆ బిల్లు ఆగదు



నిర్ణయాలు తీసుకునేందుకు వెనుకాడబోదని స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు పేరుతో పేదలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో తనకు తెలుసని అన్నారు.కరీంనగర్‌లో ఒక పేద వ్యక్తి ఇల్లు నిర్మించుకుంటే, అది వక్ఫ్ బోర్డు స్థలమని చెప్పి అధికారులు అనుమతులు రద్దు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వ్యక్తి తాత ముత్తాతలు కూడా అదే ఇంట్లో నివసించారని తెలిపారు. ఈ బిల్లుకు మతం రంగు పులిమి కొందరు కుహనా లౌకికవాదులు, ఒవైసీ అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు.ప్రజల కోసం తాను ఎన్నో పోరాటాలు చేశానని, ఆ సందర్భాలలో తాను జైలుకు వెళితే న్యాయవాదులు తనను బయటకు తీసుకువచ్చారని బండి సంజయ్ అన్నారు. కోర్టు ముందు చెట్లు తొలగించినందుకు, పాకిస్థాన్-భారత్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా పాకిస్థాన్ జెండాలు పట్టుకున్న వారిపై పోరాడిన సమయంలోనూ తాను జైలుకు వెళ్లానని ఆయన గుర్తు చేశారు.c

# బాబోయ్.. మయన్మార్‌లో మళ్లీ భూకంపం..



మయన్మార్‌లో మళ్లీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 4.7 భూకంప తీవ్రత నమోదైంది. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ఈ భూకంపానికి సంబంధించిన వివరాలను వెల్లడించింది. ఇకపోతే.. శుక్రవారం నాడు సంభవించిన భూకంపం ధాటికి మయన్మార్ జనాలు విలవిల్లాడుతున్నారు. వెయ్యికి పైగా జనాలు మృత్యువాత పడగా.. 2 వేలకు పైగా జనాలు తీవ్రంగా గాయపడ్డారు. మతుల సంఖ్య ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో.. మళ్లీ భూకంపం సంభవించడంతో.. అక్కడి జనాలు ప్రాణ భయంతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు.

**అండగా భారత్..**

భూకంపం ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మయన్మార్ ప్రజలకు భారత్ అండగా నిలుస్తోంది. బాధిత ప్రజలకు సాయం అందిస్తోంది. తాజాగా ఇండియన్ నావీ షిప్స్ ఐఎన్ఎస్ సాత్పురా, ఐఎన్ఎస్ సావిత్రి ద్వారా 40 టన్నుల నిత్యావసరాలను ఇతర వస్తువులను పంపిస్తున్నారు. ఈ విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు.c

# ఒక్క సంతకంతో ఆ పని చేస్తా..



ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయని మీరు వెళ్లి ఎవరినో అడగాల్సిన పని లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చిట్టీ రాసిస్తే చాలు తాను కొడంగల్‌కు వచ్చి అన్నీ సమస్యలు పరిష్కరిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాటిచ్చారు.తెలంగాణను పాలించే శక్తిని కొడంగల్ ప్రజలు తనకు ఇచ్చారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కొందరికి వాళ్ల కుర్చీ పోయిందన్న బాధ ఉండొచ్చు..వాళ్లను పట్టించుకోవద్దని అన్నారు. తానేం చేస్తానో ఏం చేయనో... మీకంటే ఎక్కువగా ఎవరికీ తెలియదని చెప్పారు. ఇవాళ కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. పలు భివృద్ధి కార్యక్రమాల్లో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలకు ఎక్కువ అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీనే అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.కొడంగల్‌లో ముస్లింల అభివృద్ధికి.. ఎమ్మెల్యే నిధుల నుంచి 25శాతం మంజూరు చేశామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కొడంగల్‌లో ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయని మీరు వెళ్లి ఎవరినో అడగాల్సిన పని లేదని అన్నారు. చిట్టీ రాసిస్తే చాలు తాను కొడంగల్‌కు వచ్చి అన్నీ సమస్యలు పరిష్కరిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**అంబేద్కర్ రాజ్యాంగం వల్లనే సాధ్యం..**

అలాగే వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని తన నివాసంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన జై బాపు.. జై భీం.. జై సంవిధాన్ జిల్లా సన్నాహక సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించడం.. గాంధీని హత్య చేసిన వారిని ప్రోత్సహించేలా మాట్లాడిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. దేశంలో ఇంత మంది పదవులు అనుభవిస్తున్నామంటే అది అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే సాధ్యమని ఉద్ఘాటించారు. దళిత గిరిజన ఆదివాసీ వెనకబడిన వారంతా సమానమనే స్ఫూర్తి అంబేద్కర్‌దని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించారు..**

'మన కళ్ల ముందు కనిపించే దేవుడు బాబా సాహెబ్ అంబేద్కర్. పలు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహం ఉంటుందని... అలాంటి అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించడం దారుణం. అందుకే ఇలాంటి వారిని.. వారి మాటలను ఖండించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ ఇచ్చిన పిలుపుతో ఈ కార్యక్రమం చేపట్టాం. మీరు ఆశీర్వదించి ఆదరించినందుకే నేను సీఎంగా ఉన్నా. కొడంగల్‌లో ఇంతకు ముందు ఎంత మంది ఎమ్మెల్యేలుగా ఉన్నా.. పెద్ద పదవి ఇవ్వలేదు.. అందుకే అన్ని విధాలుగా కొడంగల్ వెనుకబడి పోయింది. సిద్దిపేట, సిరిసిల్లా, గజ్వేల్‌కు నిధులు తీసుకుని పోవాలని బీఆర్ఎస్ నేతలు కలలు కన్నారు. కొద్ది మంది అమాయకులను రెచ్చగొట్టి వ్యతిరేకత చూపిస్తున్నారు. వారు ఇచ్చిన పరిహారం కన్నా ఎక్కువ పరిహారం.. వారికి ఉద్యోగం వచ్చేలా చేస్తా.. ఒకవేళ స్కిల్ లేకుంటే ట్రైనింగ్ ఇచ్చి..భూములు ఇచ్చిన ప్రతీ ఇంటికీ రెండు ఉద్యోగాలు ఇప్పిస్తా. కొడంగల్‌కు అతి పెద్ద ఉద్యోగం నాకు సీఎం ఉద్యోగం మీరు ఇచ్చారు.. మీకు ఉద్యోగం వచ్చేలా చేసే బాధ్యత నాది' అని సీఎం రేవంత్‌రెడ్డి మాటిచ్చారు.

**కొడంగల్‌ను మరింత అభివృద్ధి చేస్తా..**

'రూ.10 వేల కోట్లతో కొడంగల్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.. ఇంకో రూ.10 వేల కోట్లతో కొడంగల్‌ను మరింత అభివృద్ధి చేస్తా. నా దగ్గరకు వచ్చిన ప్రతీ ఒక్కరికీ సాయం చేశా.. కానీ నేను పైసా కూడా ఎవరినీ అడగలేదు. ఎవరూ ఏ పార్టీలో ఉన్నా కొడంగల్ అభివృద్ధికి కలసి రావాలని విజ్ఞప్తి. ఒకప్పుడు రూ.30 వేలకు ఎకరా భూమి ఉన్న కొడంగల్‌లో అభివృద్ధి పనులు జరిగితే కోట్ల రూపాయలకు ఎకరా భూమి అవుతుంది. అప్పుడు అందరూ కోటీశ్వరులవుతారు. కులగణన చేసిన ఘనత మాదే.. దీని వల్ల దామాషా పద్ధతిలో నిధుల కేటాయింపు జరపొచ్చు. మరో పదేళ్లు అధికారం మనదే.. అది కూడా కొడంగల్‌కే ఉంటుంది. కొంతమంది గుంట నక్కల్లా కాచుకు కూర్చున్నారని.. వారి ఆశలు మాత్రం పూర్తి కావు. ఈ పదేళ్లు మన జీవితంలో చాలా ముఖ్యం.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మన అజాగ్రత్త వల్ల 2018లో వెనుకబడ్డం.. కానీ నా అదృష్టాన్ని ఎవ్వరూ గుంజుకోలేదు.. నా జీవితంలో ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు.. తర్వాత సీఎంగా అయ్యా. ఈ సారి జరుగబోయే అసెంబ్లీ సమావేశంలో ప్రతీ రోజూ కొడంగల్ నుంచి ఓ మండలం వారికి అసెంబ్లీ సమావేశాలు తిలకించే విధంగా చేస్తా.. మా తడాఖా ఏంటో చూపించాలని మిమ్మల్ని అసాంబ్లీకి పిలుస్తా. స్థానిక సంస్థల ఎన్నికలు కలిసి కట్టుగా పని చేయాలి. జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# పార్టీ మాకు కన్నతల్లి వంటిది

మొదటిపేజీ తరువాయి



తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాలను ఆ పార్టీ ఎంపీలు ఢిల్లీలో ఘనంగా జరుపుకున్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నివాసంలో నిర్వహించిన వేడుకల్లో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సహా టీడీపీ ఎంపీలు పాల్గొన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి పరస్పరం తినిపించుకున్నారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మీడియాతో మాట్లాడుతూ "ఎన్టీఆర్ స్ఫూర్తి, చంద్రబాబు దార్శనికత, లోకేశ్ పట్టుదల, కార్యకర్తల కష్టం వల్ల టీడీపీ దేశంలోనే కీలకపాత్ర పోషించే స్థితికి చేరింది. ఎలాంటి కష్టాలు వచ్చినా టీడీపీ తట్టుకొని నిలబడింది.చంద్రబాబు నాయకత్వంలో కలిసికట్టుగా ముందుకెళ్తున్నాం. బడుగు, బలహీన వర్గాలను ఆదుకుంటున్న పార్టీ తెలుగుదేశం. తెలుగుదేశం పార్టీ మాకు కన్నతల్లి వంటిది. ఎన్నో సవాళ్లు, కష్టాలను అధిగమిస్తూ ముందుకెళ్తున్నాం. దేశ రాజకీయాల్లోనే టీడీపీ కీలకపాత్ర పోషిస్తోంది. తెలుగువాళ్లు ఎక్కడున్నా పార్టీ అక్కున చేర్చుకుంటోంది. విజన్ -2047 స్వర్ణాంధ్రతో కొత్త అభివృద్ధికి నాంది పలుకుతున్నాం. 9 నెలల కాలంలో రాష్ట్రానికి కేంద్రం సహకారం అందిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు కొత్త వెలుగు చూస్తున్నారు. కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటాం. కార్యకర్తలే పార్టీని నడిపించే రథసారథులు" అని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

**ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశం :** రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. టీడీపీ నేతలు, శ్రేణులు టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాలు వైభవంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. 43 ఏళ్లుగా తెలుగు ప్రజలు తమ గుండెల్లో పెట్టుకున్న పార్టీ మన తెలుగుదేశం పార్టీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. 'అన్న' నందమూరి తారకరామారావు దివ్య ఆశీస్సులతో సంచలనంగా ఆవిర్భవించిన తెలుగుదేశం దేదీప్యమానంగా వెలుగుతున్నదంటే అందుకు కారణం కార్యకర్తల తిరుగులేని పోరాటం, నిబద్ధత, త్యాగగుణమని అన్నారు. పీకపై కత్తిపెట్టినా 'జై తెలుగుదేశం' నినాదం తప్ప వేరే మాట వినిపించని గొంతుక ఉండే కార్యకర్తలు ఉన్న ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశమని చంద్రబాబు కొనియాడారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

మొదటిపేజీ తరువాయి

కొనసాగుతున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్? రాజ్ తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

**ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు స్వాధీనం**

ఘటనాస్థలం నుంచి 16 మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐజీ సుందర్?రాజ్ తెలిపారు. ఘటనాస్థలంలో ఏకే-47 రైఫిల్, సెల్ఫ్-లోడింగ్ రైఫిల్, ఇన్సాస్ రైఫిల్, పాయింట్ 303 రైఫిల్, రాకెట్ లాంచర్, బారెల్ గ్రెనేడ్ లాంచర్, పేలుడు పదార్థాలతో పాటు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించాలని నిశ్చయించుకున్నట్టు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. సుక్మాలో జరిగిన ఆపరేషన్‌లో భద్రతా దళాలు 16 మంది నక్సలైట్లను మట్టుబెట్టాయని ఎక్స్ మాధ్యమంలో పోస్ట్ చేశారు. అడవుల్లో ఆయుధాలతో ఉన్నవారికి విజ్ఞప్తి చేసిన అమిత్ షా ఆయుధాలు మార్పును తీసుకురాలేవని పేర్కొన్నారు. కేవలం శాంతి, అభివృద్ధితోనే మార్పు సాధ్యమని హితవు పలికారు.

**మూడ నెలల్లో 130 మందికి పైగా**



మావోయిస్టులు లేని దేశంగా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించిన తర్వాతే ఛత్తీస్‌గఢ్‌లో యాంటీ నక్సలిజం ఆపరేషన్స్ ముమ్మరంగా జరుగుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోనే ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 132 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇక తాజాగా ఎన్?కౌంటర్? ఈ ఏడాదిలోనే జరిగిన జరిగిన మూడో భారీ ఆపరేషన్.

# మనమంతా టీడీపీ వారసులం పెత్తందారులం కాదు

మొదటిపేజీ తరువాయి



ముందుకు సాగుతోందని చెప్పారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్?లో నిర్వహించిన పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాల్లో పాల్గొన్న చంద్రబాబు పసుపు జెండాను ఆవిష్కరించారు. పార్టీనే ప్రాణంగా బతికే పసుపు సైన్యానికి పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమానికి నాంది పలికిన మహానుభావుడు ఎన్టీఆర్ అని కొనియాడిన చంద్రబాబు తెలుగువారు ఉన్నంతవరకు పార్టీ ఉంటుందని ఉద్ఘాటించారు.వాళ్లంతా కాలగర్భంలో కలిసిపోయారు: తెలుగుదేశం వారసత్వాన్ని భావితరాలకు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. తెలుగువారు ఉన్నంతవరకూ టీడీపీ శాశ్వతంగా ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీకి మనమంతా వారసులమే కానీ పెత్తందారులం కాదన్నారు. టీడీపీని లేకుండా చేస్తామన్న వాళ్లు కాలగర్భంలో కలిసిపోయారని అన్నారు. కార్యకర్తలు కేవలం కాగితాలు ఇస్తే పదవులు రావని, క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీకి మనమంతా వారసులమే కానీ పెత్తందారులం కాదన్నారు.పసుపు సైన్యానికి పాదాభివందనం: పార్టీనే ప్రాణంగా బతికే పసుపు సైన్యానికి సీఎం చంద్రబాబు పాదాభివందనం తెలిపారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని చాటిన జెండా, తెలుగు వారికి ప్రపంచవ్యాప్త గుర్తింపు ఇచ్చిన జెండా, ఆడపడుచులకు అండగా నిలిచిన జెండా అని కొనియాడారు. రైతన్నల కన్నీరు తుడిచి, వెన్నంటే ఉన్న జెండా, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాజకీయానికి అర్థం మార్చిన జెండా, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం తెచ్చిన జెండా అని ప్రశంసించారు. భావితరాల భవిష్యత్తుకు అండగా నిలిచే పాలసీలు తెచ్చిన జెండా మన పసుపు జెండా అని చంద్రబాబు తెలిపారు.చెడును శిక్షించకపోతే మంచిని కాపాడలేం: ప్రతీ కులానికి న్యాయం చేసే ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమేనని తెలుగుదేశం అధినేత చంద్రబాబు స్పష్టంచేశారు. రాజకీయాల్లో ఎప్పుడూ లేని సంస్కృతి గత 5 ఏళ్లలో చూశామన్నారు. ఆస్తుల విధ్వంసం జరిగినా, రాజకీయ హత్యలు చేసినా, ఆర్థిక మూలాలు దెబ్బతీసినా కార్యకర్తలు ధైర్యంగా ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. మంచికి మంచిగా ఉండే మనం, తప్పు చేసి తప్పించుకోవాలనుకునే వారిని మాత్రం ఉపేక్షించమని చంద్రబాబు హెచ్చరించారు. చెడును శిక్షించకపోతే మంచిని కాపాడలేమని అన్నారు.తెలుగుదేశం పార్టీకి తిరుగులేదు: కార్యకర్తలు హుషారుగా ఉంటే తెలుగుదేశం పార్టీకి తిరుగులేదని తెలిపారు. కార్యకర్తల్లో హుషారు తగ్గినప్పుడే విపక్షం పుంజుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రతీ తెలుగుదేశం కార్యకర్తకు తప్పనిసరిగా గుర్తింపు ఇస్తామన్నారు. ప్రజల చుట్టూ తిరిగే కార్యకర్తలకు, కార్యకర్తల చుట్టూ తిరిగే నాయకులకు పార్టీ అండగా ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు.పేదరికం లేని సమాజం కోసం: రాష్ట్ర జనాభాను పెంచుకోవాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. కనీసం ఇద్దరు పిల్లలకు తక్కువ కాకుండా దంపతులు ఆలోచన చేయాలని కోరారు. పేదరికం లేని సమాజం కోసం పీ4, మార్గదర్శి-బంగారు కుటుంబం తీసుకొస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. సంపద సృష్టించాలి, ఆ సంపద పేదలకు చేరాలనేదే తన లక్ష్యమన్నారు. అట్టడుగున ఉన్నవారిని సంపన్నులు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తే తెలుగుదేశం పార్టీకి తిరుగు ఉండదని సీఎం చంద్రబాబు శ్రేణులకు సూచించారు.


# గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు రోజుకు రూ.6కోట్ల శాలరీ

ఏకకాలంలో 20 ఫోన్స్!

సుందర్ పిచాయ్‌కు గంటకు రూ.74 లక్షల శాలరీ

ఏకకాలంలో 20 ఫోన్ల వినియోగం

సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్ అంటే మహా ఇష్టం



గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వార్షిక వేతన ప్యాకేజీ ఎంతో తెలుసా? రూ.2,435 కోట్లు. ఈ లెక్కన ఆయనకు వారానికి రూ.46.4 కోట్లు, రోజుకు రూ.6.67 కోట్ల వేతనం లభిస్తుంది. ప్రతీ గంటకు పిచాయ్ సగటు సంపాదన రూ.74 లక్షలు. వాస్తవానికి 2004లో గూగుల్‌లో చేరే సమయానికి ఆయన శాలరీ చాలా తక్కువ. గత రెండు దశాబ్దాలుగా ఆయన అంకితభావంతో పనిచేస్తూ, అంచెలంచెలుగా సీఈఓ స్థాయికి ఎదిగారు. ఇప్పుడు గూగుల్, దాని మాతృ సంస్థ 'ఆల్ఫాబెట్'కు సీఈఓగా సుందర్ పిచాయ్ సారథ్యం వహిస్తున్నారు.

**ఏకకాలంలో 20 ఫోన్స్ ఎందుకంటే**

సుందర్ పిచాయ్‌కు రోజుకు రూ.74 లక్షల శాలరీని ఊరికే ఇస్తారా అంత రేంజులో బాధ్యతలు ఉంటాయి. పని ఒత్తిడి ఉంటుంది. వాటన్నింటినీ సమర్థంగా, సమగ్రంగా, సకాలంలో నిర్వర్తిస్తున్నారు కాబట్టే పిచాయ్‌కు గూగుల్ నుంచి భారీ శాలరీ లభిస్తోంది. గూగుల్ ఆఫీసులోని ఆయన క్యాబిన్‌లో మూడు కాదు, నాలుగు కాదు, ఏకంగా 20 ఫోన్లు ఉంటాయట. ఆ 20 ఫోన్ల నుంచి వచ్చే కాల్స్‌కు సుందర్ పిచాయ్ ఓపిగ్గా సమాధానం ఇస్తుంటారు. గూగుల్ పరిధిలోని అన్ని విభాగాల అధిపతులను పిచాయ్ సమన్వయం చేస్తుంటారు. అన్ని రకాల గూగుల్ ప్రోడక్ట్స్‌కు సంబంధించిన నాణ్యత, నిర్వహణ, అప్‌గ్రేడ్‌లపై ఆయన ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటారు. వాస్తవానికి అతిగా ఫోన్లను వినియోగించడం మంచిది కాదని పిచాయ్ చెబుతుంటారు. ప్రత్యేకించి పిల్లలు ఫోన్ల వినియోగాన్ని ఎంత తగ్గిస్తే అంత మంచిదని అంటారాయన. ఆన్‌లైన్ సెక్యూరిటీని కోరుకునే నెటిజన్లు పాస్‌వర్డ్‌లను పదేపదే మార్చడం కన్నా 2 స్టెప్ ఆథెంటికేషన్‌ను వాడుకోవడం మంచిదని ఒక ఇంటర్వ్యూలో పిచాయ్ సూచించారు. మానవ చరిత్రలో పెనుమార్పులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ నాంది పలుకుతుందని ఆయన అన్నారు.

**సుందర్ పిచాయ్ హాబీలు**

సుందర్ పిచాయ్‌కు క్రికెట్ ఆడటమన్నా, చూడటమన్నా మహా ఇష్టం. చిన్నప్పుడు ఆయన క్రికెటర్ కావాలని కలలు కనేవారట. చెన్నైలో చదువుకునే సమయంలో తన స్కూల్ క్రికెట్ టీమ్‌కు కెప్టెన్‌గా సుందర్ వ్యవహరించారట. ఆయన కెప్టెన్సీలో స్కూల్ క్రికెట్ టీమ్ పలు టోర్నమెంట్లలో విజయాలను అందుకుందట. భారత క్రికెట్ దిగ్గజాలు సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్‌లను పిచాయ్ బాగా ఇష్టపడతారు. అయితే టీ20 క్రికెట్ ఫార్మాట్‌ను సుందర్ అంతగా ఇష్టపడరు. టీ20 మ్యాచ్‌లను పెద్దగా చూడరు.

**కెరీర్ గ్రాఫ్**

సుందర్ పిచాయ్ 1972 జూన్ 10న తమిళనాడులో జన్మించారు.

ఆయన పాఠశాల విద్య అంతా చెన్నైలో జరిగింది.

సుందర్ తండ్రి ఎలక్ట్రికల్ ఇంజినీర్. తల్లి ఒక స్టెనోగ్రఫర్.

ఐఐటీ మద్రాస్ క్యాంపస్‌లో ఉన్న జవహర్ విద్యాలయ సీనియర్ సెకండరీ స్కూలులో సుందర్ చదువుకున్నారు.

తదుపరిగా వానా వానీ స్కూలులో చదివారు.


ఐఐటీ ఖరగ్‌పూర్‌లో మెటలర్జికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ చేశారు.

అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, పెన్సిల్వేనియా యూనివర్సిటీకి చెందిన వార్టన్ స్కూల్‌లో పిచాయ్ ఉన్నత విద్యను అభ్యసించారు.

స్టాన్‌ఫర్డ్ వర్సిటీలో మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో ఎంఎస్ కోర్సును పిచాయ్ చేశారు.

పెన్సిల్వేనియా యూనివర్సిటీకి చెందిన వార్టన్ స్కూల్‌లో ఎంబీఏ చేశారు.

# మానని గాయానికి మందు




వినాశనం, విస్ఫోటనం మధ్య చిక్కుకున్నది మానవ జీవితం. ఇలాంటి పరిస్థితుల్లో ఎలా చిక్కుకున్నామని ఒక్కసారి మనల్ని మనం ప్రశ్నించుకుంటే.. మనుషులకు మధ్య దూరం ఎలా పెరిగిందో సులభంగా అర్థమవుతుంది. మనిషి మూర?త్వ ఆలోచనలే ఇందుకు కారణం. దీనివల్ల ఈ ఆధునిక కాలంలో కూడా కొన్ని సమూహాలు ఇంకా నలిగిపోతూనే ఉన్నాయి. అలాంటి వారి గాయాలకు పసునూరి కథలు మందు రాస్తాయనడంలో సందేహం లేదు. పసునూరి రచనల్లో శ్రమైక జీవన సౌందర్యం ఉన్నది. కథల్లో జీవం ఉన్నది కాబట్టే అతని రచనలు అంత చిక్కగ ఉంటాయి. శ్రమజీవుల నుంచి పుట్టిన ప్రతీ వాక్యం సజీవంగా ఉంటుంది. కొన్నేండ్ల పాటు కాదు, కొన్ని తరాలనే శాసిస్తుంది. అట్లా పసునూరి రచించిన 'కండీషన్స్ అప్లయ్' పుస్తకంలోని కథలు ఆధునిక దళితుల గోసలను కండ్ల ముందుంచుతాయి. 2జీ నుంచి 5జీకి వచ్చినా మారిందేమీ లేదు. జనరేషన్ మారిందే తప్పా.. మనిషిలో ఇసుమంత కూడా మార్పు రాలేదు. ఇక్కడ కులోన్మాదం అనే మాయరోగం కరోనా కంటే వేగంగా విస్తరిస్తోందనే చేదునిజాన్ని చాటుతున్నాయి 'కండీషన్స్ అప్లయ్' పుస్తకంలోని కథలు. పాదం కింద ఒక నినాదం మొలుస్తుందనేది అక్షర సత్యం. ఊరు కాని ఊరు. దేశం కాని దేశం దాటి మనుషులను ముక్కలుగా చేస్తుంది. మనిషికి మనిషికి మధ్య దూరాన్ని పెంచుతోంది. ప్రయోగశాలలు, వైద్యాలయాల్లో కూడా అంటరానితనం ఇంకా అలానే ఉందనడంలో సందేహం లేదు. అద్దె గర్భం ద్వారా పుట్టే బిడ్డను కూడా కులమతాలతో వేరు చేస్తున్నారు ఈ కులోన్మాదులు. అమ్మతనాన్ని సైతం మైక్రోస్కోప్‌తో పరీక్షించే తరహాలో ఉంది నేటి సమాజం. తన కులానికి చెందినవారి ద్వారానే దాన్ని కొనేందుకు ప్రయత్నిస్తుంది కులోన్మాదం. కడుపుకే కనులుంటే కడుపు కోత అనుభవించేదా? అని ప్రశ్నించేదే ఇందులోని 'కండీషన్స్ అప్లయ్' కథ. ఊరిలో అంబేద్కర్ విగ్రహం పెట్టనివ్వకుండా దొర కుట్ర చేస్తే బహుజనులు తిప్పికొట్టిన ఒక ఉద్యమానికి స్ఫూర్తినిచ్చింది 'ధమ్కీ' కథ. ఆకలిని తట్టుకోలేక ఆకులు తిన్న లింగడిని ఆదుకోవాల్సింది పోయి, అతని ఆకలిని దైవత్వంతో పోల్చడం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం. ఇలాంటి సంఘటనను చూపించిందే 'లీఫ్ మ్యాన్' కథ. పల్లె నుంచి పట్నం దాకా, పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు కులోన్మాద విషం ఎంతలా విస్తరించిందో 'ప్యూర్లీ నాన్ వెజిటేరియన్' కథ వివరిస్తుంది. కట్టుకథలు, అసత్య ప్రచారాలతో మతకల్లోలాలు జరుగుతాయని చెప్పేదే 'వాట్సప్ స్టేటస్' కథ. ఇట్లా 'కండీషన్స్ అప్లయ్' పుస్తకంలో మొత్తం 19 కథలున్నాయి. మొదటి కథ 'లీఫ్ మ్యాన్' కాగా, ఆఖరిది 'వెంటాడే పాట'. నిన్ను నువ్వు నిరూపించడానికి సాహసిస్తే, నువ్విక ఒంటరిగా మిగలవంటూ ధైర్యాన్నిస్తాయని చెప్తుందీ పుస్తకం.


# ఇది కదా ఐలమ్మ ఆశయం!



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికావడంతో ఇటీవల ఘనంగా విజయోత్సవాలు జరుపుకొన్నది. అధికారంలోకి రాగానే చే(ఆరు) గ్యారెంటీల అమలుపై దృష్టిపెట్టిన కాంగ్రెస్ సర్కార్ వాటిలో ఒక్కటి, రెండు మాత్రమే, అవి కూడా అరకొరగా అమలుచేసింది. దీంతో ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. పాలకులం కాదు, సేవకులమని కాంగ్రెస్ నాయకులు మొదటినుంచీ చెప్తున్నారు. తమది ప్రజా పాలన అని చెప్తూ ప్రజాదర్బార్‌లు కూడా నిర్వహించారు. ఇది ప్రజాపాలనకు నిదర్శనమని వందిమాగధులు వంత పాడుతున్నారు. ముఖ్యమంత్రి కూడా ప్రజల్లో కాంగ్రెస్‌ప్రాబల్యం తగ్గకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నా రు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం న్యూయార్క్ వలె మారబో తున్నదని ప్రకటించారు. అంతేకాదు, మన దేశంలోని రాష్ట్రాలతో కాదు, ఇతర దేశాలతో తాము పోటీ పడుతున్నామని కూడా సెలవిచ్చారు. గత ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ల ద్వారా 55 వేల ఉద్యోగాలు భర్తీచేసి అపాయింట్‌మెంట్ ఆర్డర్లకు ఎల్బీ స్టేడియాన్ని అడ్డాగా మార్చారు. అయితే, మాటలు చెప్పడం సులువే, అమలు, ఆచరణే కష్టం. చాకలి ఐలమ్మ వర్ధంతి సభలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా ఆమె మనమరాలును నియమిస్తున్నామని సీఎం ప్రకటించారు. ప్రతిష్టాత్మక కోఠి మహిళా కళాశాలకు ఐలమ్మ పేరు పెట్టడం ఆమెకు నిజమైన నివాళి అని ముఖ్యమంత్రి చెప్పారు. బడుగు, బలహీన వర్గాలకు ఇది కొంతవరకు ఊరటే. దొరల గడీలను బద్దలుకొట్టి, పెత్తం దారీతనానికి పాడె కట్టిన ధీరవనిత ఐలమ్మ. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఆమె పోరాడారు. భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించాలనే లక్ష్యంతో పోరు సలిపారు. ఐలమ్మకు కావాల్సింది పేరు కాదు, వట్టి హామీలు, మాటల గారడీతో ఈ వర్గాలను మభ్యపెట్టడం అసలు కానే కాదు, ఆయా వర్గాలకు భూములు పంచి, జీవనోపాధి కల్పించి వారి సామాజిక హోదాను పెంచడమే ఐలమ్మ సంకల్పం. అయితే, ఈ వర్గాల బలహీనతలను సొమ్ము చేసుకొని అసలైన అధికారాన్ని భూస్వాములైన పెట్టుబడిదారులు అనుభవిస్తున్నారు. భూమిని పునఃపంపిణీ చేయడం ద్వారా సామాజిక న్యాయాన్ని సాధించవచ్చు. తద్వారా భూ యాజమాన్యంలో ఉండే అసమానతలను రూపుమాపవచ్చు. అందుకే, 'ఒట్టి మాటలు కట్టిపెట్టవోయి గట్టిమేలు తలపెట్టవోయి' అన్న గురజాడ మాటల సాధన చాకలి ఐలమ్మకు అసలైన నివాళి. అదే ఆమె ఆశయం కూడా. 1948 సెప్టెంబర్‌లో భారత్‌లో తెలంగాణ విలీనమైనప్పటికీ, ఎస్టేట్ల చట్టం రద్దయినప్పటికీ, 1973లో అప్పటి కాంగ్రెస్ సర్కార్ భూ పంపిణీ చట్టాన్ని తీసుకువచ్చి, 1975లో ఆ చట్టాన్ని అమలుచేసింది. ఈ రెండేండ్లలో భూస్వాములందరూ తమ భూములను బినామీ పేర్లపై మార్చుకున్నారు. తద్వారా చట్టాల పరిధిలోకి భూములు రాకుండా తప్పించుకున్నారు. దీనికి అప్పటి అధికార, ఉద్యోగ యంత్రాంగం తోడ్పడింది. ప్రస్తుతం పట్టణ భూ పంపిణీ చట్టాలను పూర్తిగా రద్దుచేశారు. దీంతో కొంతమంది భూస్వాములు వందల ఎకరాలను ఆక్రమించి ఫ్యాక్టరీలు, ఫామ్‌హౌజ్‌లు నిర్మించుకొని భూమిని అట్టిపెట్టుకున్నారు. అదే సమయంలో కార్పొరేట్ సంస్థలు ఉనికిలోకి వచ్చాయి. ఇది పాతకాలం నాటి జమిందారీ వ్యవస్థను తలపిస్తుంది. ధరల నిర్ణయంతో పాటు, భూముల కేంద్రీకరణ అంశం ఈ కార్పొరేటీకరణలో ప్రధానంగా ముందుకువచ్చింది. దీన్ని సమర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు కూడా తీసుకువచ్చాయి. తెలంగాణలో ఎస్సీలు సుమారు 14.28 శాతం మంది ఉన్నారు. బీసీలు 40 శాతానికి పైగా ఉన్నారు. ఇతర బలహీనవర్గాలు 20 శాతం వరకు ఉండవచ్చు. మొత్తంగా ఈ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల జనాభా 75 శాతం వరకు ఉంటుంది. కానీ, వీరిలో 29.97 శాతం మంది చేతుల్లో అసలు భూమే లేదు. అయితే, మిగిలిన 45 శాతం మంది చేతుల్లో 30 శాతం సేద్యపు భూమి మాత్ర మే ఉన్నది. మిగిలిన 70 శాతం సేద్యపు భూమి 25 శాత మే ఉన్న భూస్వాముల చేతుల్లో ఉన్నదని సెస్సు ఒక అధ్యయనంలో వెల్లడించింది. ఇది భూస్వామ్య వ్యవస్థను పరిరక్షించడమే. ప్రపంచంతో పోటీ పడాలంటే దక్షిణ కొరియాలో మాదిరిగా భూ గరిష్ఠ పరిమితిని ఏడున్నర ఎకరాలుగా నిర్ణయించాలి. చైనా వలె 17 రోజుల్లో భూ పంపిణీ చట్టాలను అమలుచేయండి. మన దేశంలో పంచిన మొత్తం భూమిలో ఒక్క పశ్చిమబెంగాల్‌లోనే 20 శాతం పంచా రు. మన రాష్ట్రంలో వామపక్ష సిద్ధాంతాలకు కాలం చెల్లకుండా ఉండాలంటే భూ పంపిణీపై పోరాటం చేయాలి. అదే చాకలి ఐలమ్మకు అసలైన నివాళి. భూ పంపిణీ చేసి సామాజిక తెలంగాణ తేవాలి. అప్పుడే ఐలమ్మ ఆశయం నెరవేరుతుంది.

# వారంపాటు అసెంబ్లీ శీతాకాల సమావేశాలు?

అసెంబ్లీ శీతాకాల సమావేశాలను వారం రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ నెల 9న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనప్పటికీ, సోమవారం వరకు వాయిదా పడిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం సమావేశాలు పునఃప్రారంభమైన తర్వాత తొలుత సభ్యుల మౌఖిక ప్రశ్నోత్తరాలు నిర్వహించనున్నారు. అనంతరం బీఏసీ (బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం కానున్నది. సభను ఎన్ని రోజులు నిర్వహించాలి? ఏయే బిల్లులు ప్రవేశపెట్టాలి? వంటి అంశాలపై బీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సభ సమావేశాలను వారంపాటు నిర్వహించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు సమాచారం. పంచాయతీరాజ్, మున్సిపల్ వ్యవహారాలు సహా పలు శాఖల బిల్లులు సభకు వచ్చే అవకాశాలున్నట్టు తెలిసింది. కాగా, గత సోమవారం సమావేశాల ప్రారంభం రోజే తెలంగాణతల్లి నూతన విగ్రహం, రూపురేఖలు వంటి అంశాలపై సభలో చర్చించారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులను ఉభయసభల్లోకి ఉద్దేశపూర్వకంగానే రాకుండా చేసి, ప్రభుత్వం చర్చ పెట్టిందనే విమర్శలు వినిపించాయి. తెలంగాణ ప్రజలు ఆరాధించిన తల్లిని కాదని, అభయహస్తం తల్లిని ఉద్దేశపూర్వకంగా రుద్దాలనే కుట్రను ప్రభుత్వం చేసిందని, ఆ బండారం అంతా తాము బయటపెడతామనే భయంతోనే తమను ముందస్తుగానే సభకు రాకుండా అరెస్టు చేయించిందని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలపై సర్వత్రా ఆసక్తి, ఉత్కంఠ నెలకొన్నది.



### నేడు క్యాబినెట్ భేటీ

రాష్ట్ర మంత్రివర్గం సోమవారం భేటీ కానున్నది. శాసనసభ ప్రాంగణంలోని అసెంబ్లీ కమిటీ హాల్-1లో మధ్యాహ్నం రెండు గంటలకు క్యాబినెట్ సమావేశం కానున్నది. అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న పలు బిల్లులపై క్యాబినెట్‌లో చర్చించి, ఆమోదించనున్నారు.

# జడ్చర్లకు కొత్త గా మరో 4 విద్యుత్ 33/11 సబ్ స్టేషన్లు మంజూరు

**ఇప్పటివరకు మొత్తం 12 సబ్ స్టేషన్లు మంజూరు**

**రూ. 14.60 కోట్లతో కొత్త సబ్ స్టేషన్ల పనులు**

**గొల్లపల్లి, ఆలూరు, రాణి పేట తో పాటు జడ్చర్ల పట్టణంలో కొత్త సబ్ స్టేషన్లు**

**కొత్త సబ్ స్టేషన్ల తో మెరుగుపడనున్న విద్యుత్ సరఫరా**

**ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెల్లడి**



**జడ్చర్ల, మార్చి 29తెలంగాణ సేన న్యూస్ :** జడ్చర్ల నియోజక వర్గంలో కొత్తగా నాలుగు విద్యుత్ 33/11 సబ్ స్టేషన్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. రూ.14.60 కోట్ల రూపాయల వ్యయం తో ఈ కొత్త సబ్ స్టేషన్ల ను నిర్మించనున్నారని వివరించారు.జడ్చర్ల నియోజకవర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 8 కొత్త సబ్ స్టేషన్ల ను మంజూరు చేయడం జరిగిందని శనివారం మీడియా కు విడుదల చేసిన ప్రకటన లో గుర్తు చేశారు.ఇది కాకుండా ఇప్పుడు అదనం గా మరో 4 సబ్ స్టేషన్ల ను ఇప్పుడు మంజూరు చేశారని తెలిపారు. జడ్చర్ల మండలంలోని గొల్లపల్లి, ఆలూరు గ్రామాలతో పాటు జడ్చర్ల పట్టణం లోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతానికి ఒక సబ్ స్టేషన్ మంజూరు అయిందన్నారు. ఇది కాకుండా మిడిల్ మండలంలోని రాణిపేట కు మరో సబ్ స్టేషన్ మంజూరు కావడం జరిగిందని వివరించారు. ఈ సబ్ స్టేషన్లలో గొల్లపల్లి సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.3.53 కోట్లు, ఆలూరు సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.3.86 కోట్లు, జడ్చర్ల పట్టణం లో నిర్మించే సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.3.54 కోట్లు, రాణి పేట సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.3.67 కోట్లు చొప్పున మొత్తం రూ.14.60 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు.ఈ కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం తో విద్యుత్ సరఫరా మరింత మెరుగు పడుతుందని చెప్పారు. గతంలో మంజూరు అయిన 8 సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నాలుగు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు కూడా సకాలంలో పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అనిరుధ్ రెడ్డి ఆదేశించారు.

# విద్యార్థి ఉద్యమ నాయకుడు జార్జి రెడ్డి సంస్మరణ సభ జయప్రదం చేయండి!




**మహబుబాబాద్ టౌన్ తెలంగాణ సేన మార్చి :** విద్యార్థి ఉద్యమ నిర్మాత విద్యార్థుల ప్రియతమ నాయకుడు జార్జి రెడ్డి సంస్మరణ సభను ఏప్రిల్ 11 మహబూబాబాద్ పట్టణంలో నిర్వహిస్తున్నామని సంస్మరణ సభలో జార్జి రెడ్డి అభిమానులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పి డి యస్ యూ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బొట్ల గౌతమ్ పి డి యస్ యూ జిల్లా నాయకురాలు సుహిత పిలుపునిచ్చారు. శనివారం మహబూబాబాద్ పట్టణంలో జార్జి రెడ్డి సంస్మరణ సభను జయప్రదం చేయాలని విద్యాసంస్థలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం జరిగిన విద్యార్థుల సదస్సులో వారు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల విద్యార్థుల అభివృద్ధి కోసం అడుగులు ముందుకు వేసిన జార్జి రెడ్డిని 1972 ఏప్రిల్ 14వ తేదీన మతోన్మాద ఫాసిస్ట్ శక్తులు కత్తులతో దాడి చేసి హత్య చేశారని నాటి నుండి నేటి వరకు జార్జిరెడ్డి మరణం తో వచ్చిన ప్రగతిశీల ఉద్యమాల ఉత్తేజం నేటికీ మతోన్మాద ఫాసిస్టు విధానానికి వ్యతిరేకంగా ప్రగతిశీల ఉద్యమ శక్తులు ఉద్యమిస్తూనే ఉన్నారని వారు తెలిపారు. జార్జి మరణంతో ప్రగతిశీల ఉద్యమాలు లేకుండా పోతాయని భావించిన మతోన్మాదుల.

# గ్రామభివృద్ధి నరేంద్ర మోడీ తోనే సాధ్యం



**తెలంగాణ సేన న్యూస్ మహబూబ్ నగర్ :** గ్రామ అభివృద్ధి ప్రధాని నరేంద్ర మోడీ తోనే సాధ్యమని బిజెపి నాయకులు పల్లె తిరుపతి పేర్కొన్నారు పార్లమెంటు సభ్యురాలుగా శ్రీమతి డి కె అరుణమ్మ గారి సహకారంతో నరేంద్ర మోడీ సారధ్యంలో అభివృద్ధి ధ్యేయంగా ఈరోజు మిడ్జిల్ మండల లో సిసి రోడ్ల నిర్మాణం పనుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మండల స్థానిక ఎంపీడీవో గీతాంజలి మిడ్జిల్ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి. బిజెపి మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాల మల్లయ్య రాహుల్ నాయక్ శివ నాయక్ సద్దాం బండారి ప్రశాంత్ మంగలి అశోక్ కృష్ణయ్య ఉప్పరి శ్రీను రాములు శాంతయ్య హరి కిష్టయ్య రాములు ఆంజనేయులు అలివేల బాలమణి కిష్టయ్య యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# పల్లె రవిని పరామర్శించిన సిపిఐ నేత పల్లా, ఎమ్మెల్సీ నెలికంటి సత్యం



**హైదరాబాద్, మార్చి 29 తెలంగాణ సేన :** ఇటీవల కాలికి గాయమై చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న తెలంగాణ ఉద్యమ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు పల్లె రవి ని పరామర్శించిన భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, ఇటీవల ఎమ్మెల్సీ గా ఎన్నికైన నెలికంటి సతియం యాదవ్ గారు.. శనివారం మధ్యాహ్నం సరూర్ నగర్ లో గల ఆయన ఇంటికి వచ్చి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడం జరిగింది. వీలైనంత త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలో ఉండాలని కాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సర్పంచుల సంఘాల అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ గారు, తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ గారు, బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ చెర్కు లింగం గౌడ్, నాయకులు రావుల వెంకటేష్ గౌడ్ గారు, లవ్ కుమార్, ఈదులకంటి సంపత్ కుమార్ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా, ఇటీవల ఎమ్మెల్సీ గా ఎన్నికై ఇంటికి వచ్చిన నెలికంటి సత్యం యాదవ్ గారిని చండూరు మాజీ పల్లె కళ్యాణి రవికుమార్ గారు శాలువా కప్పి, పూలబోకేతో సన్మానించారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైంది.. బీజేపీ





**చండూరు, మార్చి 28, తెలంగాణ సేన :** గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిజెపి మండల అధ్యక్షులు ముదిగొండ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని ఇడికూడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అధికారం కోసం ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేయాలని ప్రజల నుండి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ఎన్నికల హామీల్లో భాగంగా చేయూత పథకము ద్వారా పెన్షన్ ప్రతి నెలకు రూ. 2000 నుండి రూ.4000 ఇస్తామని మరియు మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి గృహిణికి ప్రతి నెల రూ.2500/- అందజేస్తామని ప్రజలకు శాసనసభ ఎన్నికల ముందు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని భారతీయ జనతా పార్టీ మండల పార్టీ తరుపున ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. బిజెపి మునుగోడు అసెంబ్లీ కో కన్వీనర్ కాసాల జనార్దన్ రెడ్డి ,బిజెపి సీనియర్ నాయకులు బొబ్బల మురళి మనోహర్ రెడ్డి , బీజేవైఎం రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్ రెడ్డి ,మండల ఉపాధ్యక్షులు జెట్టి యాదయ్య ,బూత్ అధ్యక్షులు నాంపల్లి శేఖర్ ,మండల నాయకులు పులిజాల రవీందర్ ,తుల్లా వెంకన్న ,కదారి నర్సింహా ,అబ్బానగోని యలాద్రి తదితరులు పాల్గొన్నారు.

# అల్లందేవిచెర్వు గ్రామ ప్రజలందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు: కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బాత్క శేఖర్



**నారాయణపురం, తెలంగాణ సేన :** నారాయణపురం మండలం అల్లందేవిచెర్వు గ్రామ ప్రజలందరికి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బాత్క శేఖర్.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బాత్క శేఖర్ మాట్లాడుతూ శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ ప్రజలందరికీ శుభాలు కలిగించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అద్భుతంగా ప్రజా పాలన జరుగుతున్నదని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు పండుగలా అమలు అవుతున్నాయని అన్నారు. ఈ ఉగాదిని ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నిండాలని కోరుకుంటూ, గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు

**తెలంగాణ మైన్స్, సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి దామోదర్**



**నారాయణ పురం, తెలంగాణ సేన న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ మైన్స్, సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి దామోదర్.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి దామోదర్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని, ధర్మ బద్ధమైన కోరికలు నెరవేరాలని, కొత్త సంవత్సరంలో సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో, రైతు కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలి అని అన్నారు.ఈ ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించాలని, మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ప్రతి ఒక్కరు ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

# దళితుల సమస్యల పరిష్కారాన్ని కృషి

**ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, మెంబర్ దాసరి తిరుమలేష్**



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్, మార్చ్ 29 :** దళితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి, పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ నిటరింగ్ కమిటీ మెంబర్ దాసరి తిరుమలేష్ వెల్లడించారు.మోత్కూర్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ నగర్ లో డి.టీ ఉపేందర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఏర్పాటు చేసిన (సివిల్ రైడ్ డే) పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథి.గా పాల్గొని మాట్లాడారు.ఎస్సి ఎస్టి లపై కుల వివక్షత చూపినట్లు అయితే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది హెచ్చరించారు.కార్యక్రమంలో మోత్కూర్ ఎస్ ఐ నాగరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ హేమంత్, అగ్రికల్చర్ ఆఫీసర్ స్వప్న, ఎస్సి బాలుకల హాస్టల్ వార్డెన్ రాజాలు బాయి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సుమన్, మున్సిపాలిటీ మేనేజర్ ప్రభాకర్, ఎడ్ల శ్రీకాంత్ మర్రి అనిల్, మాజీ ఎంపిటిసి కురిమిళ్ల ప్రమీల, బోడ శ్రీను, గుంటి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# అల్లందేవి చెర్వు గ్రామ ప్రజలందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు - కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సుర్వి చంద్రం



**నారాయణపురం తెలంగాణ సేన న్యూస్ :** నారాయణపురం మండలం అల్లందేవిచెర్వు గ్రామ ప్రజలందరికి శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణపురం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సుర్వి చంద్రం. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సుర్వి చంద్రం మాట్లాడుతూ గ్రామ ప్రజలందరి జీవితాల్లో వసంతాన్ని నింపి, శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరూ ప్రశాంతంగా, పాడి పంటలతో, పిల్లా పాపలతో, అష్టఐశ్వర్యంలతో, సుఖసంతోషాలతో, ఉండాలని, ప్రకృతి మాతను మనస్ఫూర్తిగా కోరారు.

# ఇస్తారు విందులో హైదరాబాద్ డిసిపి

**కులాలకు అతీతంగా ఇస్తారు విందు**



**తెలంగాణ సేన న్యూస్, సికింద్రాబాద్ మార్చ్ 29 :** సికింద్రాబాద్ వారాసిగూడ జిఎం ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఇస్తారు విందుకు హైదరాబాద్ ఈస్ట్ జోన్ డిసిపి బాలస్వామి హాజరయ్యారు. సికింద్రాబాద్ ముస్లిం కమిటీ ఏర్పాటు చేసిన ఇస్తారు విందులో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపిన హైదరాబాద్ ఈస్ట్ జోన్ డిసిపి బాలస్వామి. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ సికింద్రాబాద్ లో కులాలకు అతీతంగా అన్ని పండుగలు ఆనందంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఈ విందులో బి ఆర్ ఎస్ పార్టీ ముస్లిం కమిటీ నాయకుడు బాబా బాయ్ తో పాటు ముస్లిం కమ్యూనిటీ పెదాలు పాల్గొన్నారు.



## మీరు జుట్టుకు ఏ హెయిర్ ఆయిల్‌ను వాడుతున్నారు..?

## జుట్టు స్థితిని బట్టి ఎలాంటి ఆయిల్‌ను వాడితే మంచిది..?



శిరోజాల సంరక్షణకు ప్రస్తుతం అందరూ ప్రాధాన్యతను ఇస్తున్నారు. స్త్రీలే కాదు పురుషులు కూడా తమ కురులను అందంగా మార్చుకుంటున్నారు. అయితే అన్నీ బాగానే పాటిస్తుంటారు కానీ హెయిర్ ఆయిల్ విషయంలోనే సరైన జాగ్రత్తలు తీసుకోరు. దీంతో జుట్టు సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. అలాగే ఈ ఆయిల్ వల్ల చర్మం కూడా జిడ్డుగా మారుతుంది. ఇక కొందరు ఎప్పుడు పడితే అప్పుడే హెయిర్ ఆయిల్‌ను అప్లై చేస్తుంటారు. కానీ హెయిర్ ఆయిల్ విషయంలోనూ జాగ్రత్తలను పాటించాలి. అప్పుడే శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. మన జుట్టుకు అన్ని ఆయిల్స్ సరిపోవు. ఎలాంటి హెయిర్ ఆయిల్ ఎవరికి మేలు చేస్తుంది.. అన్న వివరాలను తెలుసుకుని అప్పుడు ఆయిల్‌ను ఉపయోగించాలి. దీంతో మంచి ఫలితాలు రాబట్టవచ్చని బ్యూటిషియన్లు చెబుతున్నారు. ఇక ఎలాంటి ఆయిల్‌ను జుట్టుకు వాడితే ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

**కొబ్బరినూనె..**

సాధారణంగా కొబ్బరినూనెను అధిక శాతం మంది జుట్టుకు వాడుతుంటారు. ఇది జుట్టు కుదుళ్ల లోపలికి కూడా వెళ్లగలదు. దీంతో శిరోజాలకు పోషణ లభిస్తుంది. కొబ్బరినూనెలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. దీని వల్ల తలలో ఉండే ఇన్‌ఫెక్షన్లు కూడా తగ్గుతాయి. ఇన్‌ఫెక్షన్ కారణంగా చుండ్రు సమస్యతో బాధపడేవారు కొబ్బరినూనెను వాడితే మంచి ఫలితం ఉంటుంది. ఈ నూనెలో మన జుట్టుకు అవసరం అయ్యే ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. అలాగే విటమిన్లు ఇ, కెలతోపాటు ఐరన్ కూడా లభిస్తుంది. ఇవన్నీ జుట్టుకు పోషణను అందిస్తాయి. కొబ్బరినూనెను జుట్టుకు వాడుతుంటే శిరోజాలు సుతి మెత్తగా మారుతాయి. శిరోజాల ఎదుగుదలకు కొబ్బరినూనె ఎంతో సహాయం చేస్తుంది.

**జొజొబా ఆయిల్..**

మార్కెట్‌లో మనకు జొజొబా ఆయిల్ కూడా లభిస్తుంది. జొజొబా అనే మొక్కకు చెందిన గింజల నుంచి ఈ నూనెను తీస్తారు. ఈ మొక్కలు అమెరికాలోని ఎడారుల్లో పెరుగుతాయి. ఈ విత్తనాలను డీర్ నట్స్‌అని కూడా పిలుస్తారు. అమెరికన్లు తమ జుట్టుకు ఎక్కువగా జొజొబా ఆయిల్‌ను ఉపయోగిస్తుంటారు. జుట్టు బాగా పొడిగా మారిన వారు, తరచూ తలంతా పొడిగా మారుతున్న వారు ఈ నూనెను వాడాలి. జిడ్డు చర్మం అయ్యే వారు ఈ నూనెను వాడకూడదు. ఇక శిరోజాల సంరక్షణకు ఆలివ్ ఆయిల్ కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇది జుట్టును మంచి కండిషనింగ్‌లో ఉంచుతుంది. గ్రీకులు ఆలివ్ ఆయిల్‌ను అధికంగా ఉపయోగిస్తారు. జుట్టు బాగా పలుచగా ఉన్నవారు, జుట్టు బాగా రాలిపోతున్న వారు ఆలివ్ ఆయిల్‌ను వాడితే మేలు జరుగుతుంది. ఇది శిరోజాల పెరుగుదలకు కావల్సిన పోషణను అందిస్తుంది.

**ఆముదం..**

మన పెద్దలు ఎంతో పూర్వం కాలం నుంచి ఆముదాన్ని జుట్టుకు ఉపయోగిస్తున్నారు. దీని వాసన కారణంగా చాలా మంది దీన్ని జుట్టుకు ఉపయోగించరు. కానీ దీన్ని తలకు మర్దనా చేసి 2 గంటల పాటు ఉండి తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తుంటే శిరోజాలు నల్లగా మారుతాయి. జుట్టు ఒత్తుగా పెరిగి దృఢంగా ఉంటుంది. ఆముదంతో ఇలా మసాజ్ చేస్తుంటే తలపై ఉండే ఇన్‌ఫెక్షన్లు కూడా తగ్గుతాయి. ఆముదం జుట్టుకు పెట్టడం ఇష్టం లేని వారు ఇలా మసాజ్ చేస్తే చాలు. ఎంతో ప్రయోజనం పొందవచ్చు. అలాగే బాదం నూనె కూడా జుట్టుకు ఎంతో మేలు చేస్తుంది. ఇది జిడ్డు లేని నూనె. జిడ్డు చర్మం ఉన్నవారు ఈ నూనెను తలకు వాడాలి. ఇది జుట్టుకు అవసరం అయిన పోషకాలను అందిస్తుంది. ఈ ఆయిల్‌ల ఓలిక్ యాసిడ్, లినోలిక్ యాసిడ్ ఉంటాయి. ఇవి శిరోజాలను సంరక్షిస్తాయి. జుట్టును ఇన్‌ఫెక్షన్ నుంచి రక్షిస్తాయి. ఇలా జుట్టు రకం, చర్మాన్ని బట్టి ఎవరికి తగిన హెయిర్ ఆయిల్‌ను వారు వాడితే అన్ని రకాలుగా ప్రయోజనాలను పొందవచ్చు.

# క్షయను జయిద్దాం

క్షయ అనుక్షణం భయపెట్టించే అంటువ్యాధి. నాలుగు వేల సంవత్సరాలుగా మానవ మనుగడను శాసిస్తున్న మహమ్మారి. భూమ్మీద క్షయ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నది భారతదేశంలోనే. ప్రపంచవ్యాప్తంగా సుమారు కోటి ఎనభై లక్షల మంది టీబీతో బాధపడుతుండగా, అందులో నాలుగో వంతు మనదేశంలోనే ఉండటం ఆందోళనకరం. ప్రతి మూడు నిమిషాలకు ఒక రోగి క్షయతో మరణిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ దుస్థితికి కారణం ఈ వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన లేకపోవడం. నిర్లక్ష్యం. క్షయ ప్రధానంగా ఊపిరితిత్తులకు సోకినప్పటికీ, ఇతర అవయవాలకు కూడా ప్రమాదం పొంచి ఉంటుంది. కాబట్టి, రోగులను దీర్ఘకాలం పాటు పీడించే ఈ ప్రాణాంతకమైన వ్యాధి పూర్వాపరాలను తెలుసుకోవడం తప్పనిసరి. మనదేశంలో రోజుకు ఎంతోమంది క్షయతో మరణిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) లెక్కలు వెల్లడిస్తున్నాయి. అందులోనూ ముఖ్యంగా హెచ్‌ఐవీ, క్యాన్సర్ రోగులు, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడే రోగులు ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తున్నది. ఇలా ఉంటే 1882 మార్చి 24న క్షయవ్యాధికి కారణమయ్యే సూక్ష్మజీవిని జర్మనీ శాస్త్రజ్ఞుడు రాబర్ట్ కోచ్ కనుక్కొన్నాడు. వ్యాధి నివారణకు శ్రీకారం చుట్టాడు. దీనికి గుర్తుగా వందేండ్ల తర్వాత నుంచి ఏటా మార్చి 24ను ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినంగా జరుపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ వ్యాధి గురించి అవగాహన చేసుకుందాం.

**ఎలా వస్తుంది?**

ఈ వ్యాధి 'మైకోబ్యాక్టీరియం ట్యూబర్‌క్యులోసిస్' అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. దీన్ని ట్యూబర్‌క్యులోసిస్ (టీబీ) అని కూడా పిలుస్తారు. ఈ వ్యాధిగ్రస్తులు మాట్లాడినప్పుడు, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, ఉమ్మివేసిన సందర్భాల్లో గాలిలోకి విడుదల అయ్యే తుంపర్ల వల్ల చుట్టుపక్కల వారికి క్షయ సోకుతుంది. ఈ వ్యాధి రెండు రకాలు. మొదటిది ఊపిరితిత్తుల క్షయ, రెండోది ఇతర అవయవాల క్షయ. ఒకరి నుంచి మరొకరికి వ్యాపించేది ఊపిరితిత్తుల క్షయ.

**వ్యాధి లక్షణాలు**

2 వారాలు లేదా అంతకంటే ఎక్కువ రోజులు దగ్గు రావడం.

సాయంత్రం, రాత్రి సమయాల్లో జ్వరం, చెమటలు పట్టడం.

అవాంఛనీయంగా బరువు తగ్గడం.

ఆకలి మందగించడం.

ఆయాసం, నీరసించిపోవడం.

దగ్గుతోపాటు తెమడలో రక్తం పడటం.

ఎలా నిర్ధారిస్తారు?

తెమడ పరీక్ష ద్వారా వ్యాధిని గుర్తిస్తారు. ప్రత్యేక సందర్భాల్లో డీఎన్‌ఏ పరీక్ష ద్వారా కూడా బ్యాక్టీరియాను గుర్తిస్తారు.

**నివారణ సాధ్యమేనా?**


క్షయను వందశాతం నివారించవచ్చు. అయితే, వ్యాధిని సకాలంలో గుర్తిస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఈ దిశగా ముందుగా క్షయ వ్యాధిపై ప్రజల్లో పూర్తి అవగాహన ఉండాలి. వ్యాధి లక్షణాలు కనిపించగానే, లేదంటే రెండు వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు ఉంటే వెంటనే వైద్యులను సంప్రందించి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి ఉన్నట్టు తేలితే వెంటనే మందులు వాడటం మొదలుపెట్టాలి. వైద్యులు సూచించిన మందులను రోగి తు.చ. తప్పకుండా ఆరు నెలలు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుంది. కానీ, కొంతమంది దగ్గు, జ్వరం తగ్గగానే నెల రోజుల్లోనే మందులు మానేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. దీనివల్ల రెండో రకం క్షయ, అంటే మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ ఎండీఆర్ టీబీ వస్తుంది. దీని చికిత్స కాలం 9 నెలల నుంచి ఏడాది కాలం దాక ఉంటుంది. ఈ రకం క్షయకు చికిత్స వ్యయం కూడా ఎక్కువే. పైగా దుష్ప్రభావాలూ అధికంగా ఉంటాయి. ఈ దశలో కూడా మందులు వాడటం నిర్లక్ష్యం చేస్తే వ్యాధి మరింత ముదురుతుంది. ఎక్స్‌టెన్సివ్‌లీ డ్రగ్ రెసిస్టెంట్ ఎక్స్‌డీఆర్ టీబీగా రూపాంతరం చెందుతుంది. ఈ దశలో చికిత్స అందించినా పెద్దగా ప్రయోజనం ఉండదు! ఈ మధ్యకాలంలో ఎండీఆర్, ఎక్స్‌డీఆర్ కేసుల సంఖ్య పెరుగుతుండటం బాధాకరం. కాబట్టి, క్షయ గురించి అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రజలు కూడా క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి. దేశంలో 40 శాతం కన్నా ఎక్కువ మంది వరకు టీబీ ఇన్ఫెక్షన్‌కు లోనైన వాళ్లు ఉంటారు. అయితే, ఇన్ఫెక్షన్‌కు గురైన వాళ్లందరికీ క్షయ రాదు. వాళ్లలో రోగ నిరోధక శక్తి తగ్గడం, తగిన పోషకాహారం తీసుకోని సందర్భంలో ఇన్ఫెక్షన్ వ్యాధిగా మారే ప్రమాదం ఉంది. హ్యూమన్ ఇమ్యూనో వైరస్ (హెచ్‌ఐవీ), క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధి బాధితుల్లో టీబీ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. సకాలంలో వ్యాధిని నిర్ధారించి, కచ్చితమైన మోతాదులో, పూర్తికాలం మందులు వాడితే టీబీని 6 నెలల్లో వంద శాతం నివారించవచ్చు.



**డ్రగ్ రెసిస్టెంట్ కేసులకూ మందులు**

డ్రగ్ రెసిస్టెంట్ కేసులకు అంటే మందులు వాడిన తర్వాత, వివిధ కారణాల వల్ల రెండోసారి టీబీ బారినపడిన రోగులకు ప్రస్తుతం మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. గతంలో డ్రగ్ రెసిస్టెంట్ కేసుల్లో కేవలం 30 శాతం మాత్రమే ఫలితాలు ఉండేవి. ఇప్పుడు 60 నుంచి 65 శాతం వరకు ఫలితాలు కనిపిస్తున్నాయి.

# వంతారా ఎంతో వింతేరా..!


















చిన్న పిల్లలకి సహజంగానే జంతువులంటే ఆకర్షణ ఉంటుంది. వాటితో చాలా తొందరగా బంధాన్ని ఏర్పరచుకోగలుగుతారు. వాళ్ల కథల్లోనూ కార్టూన్లలోనూ కూడా ఎప్పుడూ అవే ఉంటాయి. వాటికి ఎలాంటి కష్టమొచ్చినా అయ్యో అని బాధపడిపోతుంటారు. అయితే, అలాంటి ఓ పిల్లాడి అనుబంధమే నేడు 200 ఏనుగులు సహా 2000 దాకా జంతువులను కాపాడే ఓ వన్యప్రాణి సంరక్షణా కేంద్రం ఏర్పాటుకు కారణమైంది. కొన్ని వందల మంది డాక్టర్లు, నిపుణులు వాటి బాగోగులు చూసుకునే బాటయింది. రిలయన్స్ సంస్థల అధినేత ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీనే ఆ పిల్లవాడు. ఇక, వింతైన ఆ జంతు ప్రపంచమే గుజరాత్ రాష్ట్రపు జామ్ నగరలో ఉన్న 'వంతారా జూ'! అనంత్ అంబానీకి పన్నెండేండ్ల వయసులో తల్లి నీతాతో కలిసి ఓ ఊరికి వెళుతున్నాడు. అందమైన చెట్లు, పరిగెడుతున్నాయా అనిపించే ఊళ్లూ చూస్తూ కూర్చున్నాడు అనంత్. అదే దారిలో ఓ ఏనుగు పిల్ల కనిపించిందతనికి. ఇంకేం, ఎగిరి గంతేసినంత పనిచేశాడు. కానీ పరిశీలించి చూస్తే పాపం అది ఎంతో ఇబ్బందిగా నడుస్తున్నది. మావటి వాడు దాన్ని ఎలాగోలా తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు. అది చూసిన అనంత్ మనసు చలించిపోయింది. 'పాపం కదా అమ్మా మనం పెంచుకుందామా దాన్ని' అని అడిగాడు. 'సరే నువ్వు జాగ్రత్తగా చూసుకుంటావా మరి'%ౌ%అని అడిగింది తల్లి. 'అవునమ్మా నేను దాన్ని బాగా చూసుకుంటాను' అని చెప్పాడా పిల్లవాడు. అలా ఆ ఏనుగు పిల్ల అనంత్ దగ్గరికి చేరింది. 'దాన్ని తీసుకున్నప్పటికి కనీసం అది ఏం తింటుందో కూడా తెలీదు' అని చెబుతాడు అనంత్. 'మావటి వాడు ఏం చెబితే అదే పెట్టేవాళ్లం. దానికి ఏమైనా అయితే చికిత్స చేయించడానికి కూడా పెద్దగా నిపుణులు అందుబాటులో లేరు. అయితే ఇన్నాళ్లలో మేం చాలా నేర్చుకున్నాం. ఆ ఒక్క ఏనుగే కాదు, ఎన్నో ఆపదలో ఉన్న జంతువులు మా దగ్గర వచ్చి చేరాయి. మరెన్నో గాయాల పాలై, ప్రాణాపాయంలో ఉన్న జీవులు ఇక్కడ కోలుకుని ఆనందంగా ఆడుకుంటున్నాయి. వాటికోసం ఎంతో పరిశోధనలు చేసి వందల సంఖ్యలో నిపుణుల్ని నియమించాం. విభిన్న జాతుల జంతువులు ఇక్కడి అడవిలో చక్కగా తిరుగుతూ ఉండటం చూస్తే ఎవరికైనా ఆనందం కలుగుతుంది' అని తన ఈ ముందడుగు గురించి చెబుతాడు అనంత్. ఇంతకీ వంతారా అంటే ఏమిటో చెప్పలేదు కదూ స్టార్ ఆఫ్ ద ఫారెస్ట్ అడవి చుక్క అని అర్థం! వంతారాలో మొత్తం 43 విభిన్న జాతులకు చెందిన 2000 దాకా జంతువులు ఉన్నాయి. అందులో 200 ఏనుగులు ఉన్నాయి. మంచు చిరుతలు, తెల్ల పులులతో పాటు విభిన్న రకాల చిరుతలు, పులులు, సింహాలు ఇక్కడ తిరుగుతుంటాయి. అనేక రకాల పాములు, మొసళ్లు, జిరాఫీలు, జీబ్రాలు, హిప్పోలు భారత్ సహా ప్రపంచంలోని విభిన్న ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి చేరాయి. అంతేకాదు, అంతరించిపోతున్న జాతులుగా ఉన్న దేవాంగ పిల్లి, బట్టమేక పిట్ట, రాబందు, ఒకాపి, కారకల్ లాంటి జంతు, పక్షుజాతులెన్నో ఇక్కడ తమ ఉనికిని పెంపొందించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. గుజరాత్ రాష్ట్రంలోని జామ్ నగర్‌లో మొత్తం 3000 ఎకరాల్లో ఉన్న దీనిలో ఈ జీవులన్నీ తమ కోసం కేటాయించిన విశాలమైన ప్రాంగణాల్లో సంచరిస్తుంటాయి. అడవుల నరికివేత వల్ల తమ స్థావరాలను కోల్పోవడం, వేట, స్మగ్లింగ్ లాంటి రకరకాల ప్రమాదాలకు గురయిన జంతువులే ఇవన్నీ. వేరువేరు ఆరోగ్య సమస్యలతో వచ్చే వాటిని ఇక్కడి నిపుణులైన వైద్యులు పరిశీలిస్తారు. ప్రపంచంలోనే అగ్రశ్రేణి వైద్యులు, జంతు సంరక్షణ నిపుణులతో పాటు న్యూట్రీషనిస్టులు, పాథాలజిస్టుల్లాంటి 500 మంది అంకిత భావం కలిగిన నిపుణుల బృందం వీటి జబ్బులు, గాయాలను నయం చేసేందుకు పనిచేస్తున్నది. క్రూర జంతువులా, సాధు జంతువులా, సరీసృపాలా అన్నదాన్ని బట్టి అన్ని జంతువులకూ స్వేచ్ఛగా సంచరించేందుకు సరిపడా స్థలాన్ని కేటాయిస్తారు. వీటి బాగోగులు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకునేందుకు 2100 మంది దాకా ఉద్యోగులు ఉన్నారు. 75 యానిమల్ అంబులెన్సులు కూడా ఉన్నాయిక్కడ. వంతారాలో ప్రధాన ఆకర్షణ ఏనుగులే. ఇక్కడ ఉండే 200కు పైగా గజరాజుల సంరక్షణ కోసం 25000 చదరపు అడుగుల్లో ఆసుపత్రి కట్టారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్దది. భారీగా ఉండే ఈ జంతువులకు ఆర్థరైటిస్‌లాంటి ఎముకల సమస్యలు ఏర్పడుతుంటాయి. దానికి హైడ్రోథెరపీ అని చేస్తారు. కాళ్ల సమస్యలు, కీళ్ల నొప్పులు ఉండే ఏనుగులు ఇక్కడి హైడ్రోథెరపీ పూల్స్‌లో కొన్ని గంటల పాటు సేదతీరి, సాంత్వన పొందుతుంటాయి. ఇవికాక, ముల్తానీ మట్టి మసాజ్, జకుజీ (బాత్ టబ్ థెరపీ)లాంటివీ వీటి కోసం ఏర్పాటు చేశారు. ఇక, ఇందులో నివసించే జంతువుల ఆరోగ్య పరీక్షల కోసం, శస్త్ర చికిత్సలు, ఇతర చికిత్సల కోసమూ ఏర్పాట్లున్నాయి. ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకువెళ్లగలిగే పోర్టబుల్ ఎక్స్-రే, లేజర్ మెషీన్‌లు, సీటీ, ఎంఆర్ఐ యంత్రాలు, ఐసీయూ, డయాలిసిస్ కేంద్రం, పాథాలజీ ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లు, హైపర్ బారిక్ ఆక్సిజన్ ఛాంబర్లు ఉంటాయి. అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీలాంటివి పరీక్షలు చేసే పరికరాలూ ఇక్కడ ఉన్నాయి. కేవలం జంతువులను కాపాడి ఆరోగ్యాన్ని బాగు చేయడమే కాదు, వాటి గురించిన పరిశోధనలు జరిపే ప్రత్యేక విభాగమూ వంతారాలో ఏర్పాటయింది. ఆపదలో ఉన్న జంతువుల సంరక్షణ కోసం ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్, వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఫర్ నేచర్ లతో కలిసి పనిచేస్తున్నది వంతారా. వివిధ దేశాల్లోని జంతు సంరక్షణ కేంద్రాలతో పాటు ముఖ్యంగా మెక్సికో, వెనెజుల్లాలో ఉన్న రెస్క్యూ సెంటర్ల భాగస్వామ్యమూ ఉంది. భారత్‌లోని నేషనల్ జూ అథారిటీతోనూ టై అప్ అయ్యింది వంతారా. దేశవ్యాప్తంగా జూ లను ఏర్పాటు చేసేందుకు మంతనాలు చేస్తున్నది. ఇటీవలే ప్రధాని అధికారికంగా ఓపెన్ చేసిన ఇది, త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. 'ఆవులో మూడు కోట్ల దేవతలూ ఉంటారంటారు. నేను ప్రతి ప్రాణిలోనూ దేవుడిని చూస్తాను. వాటికి సేవ చేయడం నిజంగా అదృష్టంగా భావిస్తాను. ఎందుకంటే మనుషులకు సేవ చేసే వాళ్లు చాలామందే ఉంటారు. కానీ నోరులేని ఈ ప్రాణులకు సేవ చేసే వాళ్లు చాలా తక్కువ. అందుకే అలాంటి జంతువుల కోసం ఈ నా ముందడుగు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.' అంటూ ప్రేమ పూర్వక గొంతుకతో చెబుతాడు అనంత్. ఆపద నుంచి గట్టెక్కిన ఎన్నో మూగజీవాలకు ఈ నీడ నిజంగా దేవుడి తోడే కదూ!

# కలుపు మొక్కనెలా కలుపుకొని సాగడం?




'మన శత్రువులు వేర్వేరు రూపాలను తీసుకొని ఉండవచ్చు, కానీ మనం మారలేదు. మన పోరాటాలు మారలేదు. అదే డీఎంకే' అని కలైవానర్ అరంగంలో 2024, అక్టోబర్ 5న ఆ పార్టీ ఎంపీ తిరుచ్చి శివ రాసిన ఐదు పుస్తకాలను ఆవిష్కరించిన సందర్భంగా తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ సందేశమిచ్చారు. ప్రఖ్యాత వర్ధమాన సినీ నటుడు, ప్రగతిశీల వాది అయిన ప్రకాశ్‌రాజ్ కూడా పాల్గొన్న ఆ సమావేశంలోనే చరిత్రను మార్చడానికి, పుకార్లను వ్యాప్తి చేయడానికి, అసత్యాల ఆయువు పెంచడానికి రాజకీయ శత్రువులు నిరంతరం చేసే ప్రయత్నాలను ఓడించడానికి సత్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లో ఉంచడమే పరిష్కారమని కూడా అన్నారు. నిజమే, సాంఘిక దురాచారాలు, ఆత్మగౌరవం, తమిళ అస్తిత్వం అంశాలపై ఎటువైపు నుంచి దాడి ఎదురైనా, ఏ శక్తులతో తలపడాల్సిన సందర్భం ఎదురైనా డీఎంకే నిర్మాతలైన అన్నాదురై నుంచి కరుణానిధి వరకు పెరియార్ మార్గాన్ని మదిలో ఉంచుకునే జనాన్ని నడిపించారు. జస్టిస్ పార్టీ, ద్రవిడార్ కళగం అనుభవాల నుంచి తమిళనాడు రాష్ట్ర రాజకీయ అస్తిత్వం కోసం ద్రవిడ మున్నేట్ర కళగం చాలా స్పష్టమైన కార్యాచరణనే సుదీర్ఘకాలం ఆచరణాత్మకంగా నమ్ముకున్నది. దానివల్లనే ఒక ప్రాంతీయ పార్టీ ఏడున్నర దశాబ్దాల పాటు క్రియాశీలకంగా మనుగడ సాగించడమే కాదు రాష్ట్ర, దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకమైన అధ్యాయాన్ని సంపాదించగలిగింది. అయితే తాజాగా స్టాలిన్ నేతృత్వంలో ఆ పార్టీ ప్రారంభించిన డీలిమిటేషన్ వ్యతిరేక పోరాటంలో దక్షిణాది రాష్ట్రాల హక్కుల నినాదంతో పాటు ఎన్నికల రాజకీయాల్లో తమిళ ఏజెండాను భావోద్వేగ అంశంగా నిలబెట్టి, రాజకీయ విరోధులను నిలువరించాలనే డీఎంకే సహజమైన ఎత్తుగడ కూడా ఇమిడి ఉన్నదనేది ఎవరూ కాదనలేని వాస్తవం. అయితే ఆ పార్టీ ఎత్తుకున్న డీలిమిటేషన్ వ్యతిరేక పోరాటాన్ని, త్రిభాషా విధానానికి నిరసనగా వినిపిస్తున్న వాదనను యూజీసీ ప్రతిపాదనల వెనుక రాష్ట్రాల హక్కుల హననం వైఖరిని తేటతెల్లం చేయడాన్ని సమాఖ్య విధానాన్ని, రాజ్యాంగస్ఫూర్తిని విశ్వసించే వారెవరైనా సమర్థించి తీరవలిసిందే. అయితే, తమిళనాడు ప్రయోజనాలకు, ఆత్మ గౌరవానికి స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతరం బలమైన విరోధిగా నిలబడిన కాంగ్రెస్ పార్టీని కూడా తాజాగా ప్రతిపాదిస్తున్న పోరాట జట్టులో కలుపుకొని సాగాలనే అంశంపైనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాకుండా ఉండలేవు. ఆనాటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని అన్యాయమైన విధానాల నుంచి ఇండిపెండెంట్ ఇండియాలో సుదీర్ఘకాలం తమిళనాడు రాష్ట్ర ప్రజలు ఎదుర్కొన్న దుఃఖపూరితమైన అనుభవాలకంటే ఎన్నో రెట్ల ఎక్కువ వేదనను తెలంగాణ రాష్ట్రం అనుభవించిందన్నది చరిత్ర చెప్తున్న సత్యం. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్లు చెల్లనేరవని న్యాయస్థానాలు తప్పుపట్టడంపైనే పెరియార్ నిప్పుల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీ వైఖరి ఇప్పటికైనా మారిందా అంటే వెయ్యి జీవులను మింగిన రాబందు, మళ్లీ అవకాశం కోసం ఆవు మొహం పెట్టుకొని తిరుగుతున్న విధంగానే ఉన్నది. అందుకే మొన్నటికి మొన్న ఇండియా కూటమిలోనే ఉన్న ఢిల్లీ రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించేందుకు పావులు కదిపి, బీజేపీ గెలుపునకు సహకరించింది. ఈ కుట్రను స్వయంగా రేవంత్ రెడ్డే బయటపెట్టాడు. ఢిల్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కేజ్రీవాల్ పార్టీ ఓటమికి వ్యూహాలు పన్నిందే కాంగ్రెస్ పార్టీ అని బీరాలు పలికాడు. సిరా రాతలు ఆరకమునుపే దేశ రాజ్యాంగా న్ని బ్రాహ్మణ డాక్యుమెంట్‌గా వర్ణించి, ప్రత్యేక ద్రవిడనాడు దేశమే కావాలంటూ వేర్పాటు ఉద్యమాన్ని రగిలించాడు. దాంతో మొదటి ప్రధాని నెహ్రూ రాజీకి వొచ్చేలా, తొలి రాజ్యాంగ సవరణ జరిగేలా చేసి, స్వతంత్ర దేశంతో అడుగులు కలపడంలోనే హక్కుల పట్ల రాజీలేనితనాన్ని తమిళజాతి చూపించగలిగింది. అదే స్ఫూర్తితో 1949లో మొదలైన డీఎంకే, కాంగ్రెస్ పార్టీ అన్యాయమైన రాజకీయాలను ప్రజల్లో ఎండగడుతూ, ఎట్టకేలకు 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి అధికారం హస్తగతం చేసుకున్న తొలి ప్రాంతీయ పార్టీగా చరిత్రలో నిలిచింది. ఇలా చాలా స్పష్టాతి స్పష్టంగా తొలి నాటనే తమ రాష్ట్ర ఆత్మగౌరవానికి రాజకీయ శత్రువు కాంగ్రెస్ పార్టీనే అనే కీలక అంశాన్ని సైద్ధాంతికంగా ద్రవిడియన్ భావజాలంలో మిళితం చేసి ప్రజలందరి హృదయాల్లో నాటగలిగింది. అయితే, 2014 నాటికే పూర్తిగా తమిళనాట కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా నిర్వీర్యం చేసి, డీఎంకే ఆశ్రిత సంస్థగా లొంగదీసుకోగలిగింది. అయితే డీఎంకే మూల సిద్ధాంతకర్తలైన పెరియార్, అన్నాదురై విశ్వసించిన ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, రాష్ట్రాల ఆత్మ గౌరవం తదితర మౌలికమైన రాజ్యాంగ అంశాల పట్ల అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఒక తీరున, విపక్షంలో ఉన్న రాష్ట్రాల్లో మరో తీరున అపరిచితుడు సినిమాలో వలె భిన్న మొహాలతో ప్రవర్తిస్తున్న కాంగ్రెస్ పార్టీని కూడా రాష్ట్రాల హక్కుల సాధన పోరులో కలుపుకొని సాగాలనుకోవడంపై ఏకాభిప్రాయానికి రావడం కష్టం. కాంగ్రెస్ అనే కలుపు మొక్కను కూటమిలో పెట్టుకొని రాష్ట్రాల హక్కుల ఉద్యమాన్ని ప్రాంతీయ రాజకీయశక్తులు కొనసాగించడం ఏమిటనే ఆందోళన వ్యక్తమౌతున్నది. రాజ్యాంగానికి తూట్లు పొడవడంలో, సమాఖ్య స్ఫూర్తికి కళంకం తేవడంలో, కాంగ్రెసేతర గవర్నమెంట్‌లను కూలదోయడంలో, అంతెందుకు బడుగు వర్గాలకు అవకాశాలను దూరం చేయడంలో హస్తం పార్టీ అతి పెద్ద పాపాలపుట్టనే కదా? నంబుద్రీపాద్ నుంచి ఎన్టీఆర్ దాకా దక్షిణ భారతదేశంలో కాంగ్రెసేతర ప్రభుత్వాలను కూల్చివేసిందే కాంగ్రెస్ పార్టీ. డీలిమిటేషన్‌తో పాటు హిందీ భాష, యూజీసీ నిబంధనల వివాదంలో తొలి అడుగు వేసిందే కాంగ్రెస్ పార్టీ కేంద్ర సర్కార్లు. 1937లోనే నాటి మద్రాస్ ప్రెసిడెన్సీలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తే, మూడేండ్ల పాటు ఉధృతంగా వ్యతిరేక పోరాటం నడిచింది. దానివల్లనే హిందీ, ఇంగ్లీష్‌లను అధికార భాషలుగా గుర్తించారు. మళ్లీ 15 ఏండ్ల తర్వాత హిందీని ఇదే కాంగ్రెస్ పార్టీ సర్కార్ జాతీయ అధికార భాషగా ప్రకటించే ప్రయత్నం చేసింది. అయితే తమిళనాడు వ్యతిరేకతకు జడిసి 1963 అధికార భాషా చట్టంలో హిందీతో పాటు ఇంగ్లీష్ ను చేర్చారు. అలాగే, 2009, 2011లో రాష్ట్రాల విద్యాహక్కులు హరించే ప్రయత్నం కాంగ్రెస్ చేసిం ది. పశ్చిమబెంగాల్, తమిళనాడు నిరసించడంవల్లనే వెనక్కి తగ్గారు. ఇలాంటి ధోరణిలో బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే. అంతెందుకు రిజర్వేషన్ల కోసమే ప్రత్యేక ద్రవిడనాడు పోరాటం చేసిన తమిళనాడు రాష్ట్ర మేధావులు, నేతలకు.. ప్రత్యేక దేశం గా, అనంతరం ప్రత్యేక రాష్ట్రంగా వర్ధిల్లిన తెలంగాణపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎలా దాడి చేసి, ఐదున్నర దశాబ్దాలు ఎలా అడుగడుగునా వంచించిందో చరిత్ర సాక్షిగా తెలియకుండా ఉండదు. తమిళనాడు కంటే తెలంగాణ, డీఎంకే కంటే బీఆర్ఎస్ ఎన్నో రెట్లు ఎక్కువ నిర్బంధాన్ని, నష్టాన్ని, కష్టాలను కాంగ్రెస్, బీజేపీల వల్ల అనుభవించాయి. ఎంతో వైవిధ్యమైన ఉన్నతమైన చరిత్రనూ, త్యాగాలనూ తెలంగాణ ప్రజలు పండించారు. కానీ, తెలంగాణలో హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ నుంచి మంత్రివర్గ విస్తరణ వరకు, ప్రతి పైసా ఖర్చుపెట్టడం కోసం 37 సార్లు ఢిల్లీ వెళ్లి, గాంధీల అనుమతి తీసుకునే పరిస్థి తి ఏర్పడింది. ఇది త్యాగాల తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు బలితీసుకోవడం కాదా? ఇలా ఇంకా మారని, మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రాంతీయ రాజకీయ శక్తులను వేటాడుతామని కేజ్రీవాల్ ఉదాహరణతో తేటతెల్లం చేస్తున్న కాంగ్రెస్‌ను కలుపుకొని సాగడం వల్ల ప్రాం తీయ పార్టీలకు, రాష్ట్రాలకు ముప్పే. బీఆర్ఎస్, డీఎంకే తదితర పార్టీల పుట్టుక, సుదీర్ఘ పోరాటం, త్యాగాల వెనుక ప్రాంతీయ ఆకాంక్షలున్నాయి. కాబట్టి డీఎంకే తాజా పోరాట ఎజెండాలో ఎంత న్యాయమున్నదో, జట్టులో కపట కాంగ్రెస్‌ను కలుపుకొనిపోవడంలో అంతే నష్టమున్నది. పైగా అధికారంలో ఉన్నంత మాత్రాన తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి లాంటి ఢిల్లీ దళారీ పాలకుల నేతృత్వంలో రాష్ట్రాల హక్కుల సాధన పోరు రెండో సమావేశం జరపాలని నిర్ణయించడం ప్రజాస్వామ్యవాదులకు ఎబ్బెట్టుగా అనిపిస్తున్నది. డీఎంకే, బీఆర్ఎస్ తలపెట్టిన పోరాటాన్ని, కాంగ్రెస్ కలుపుమొక్కను తీసేసి కొనసాగించగలిగితే, ఈ జట్టులో అధికారంలో లేకపోయినా సరే మిగతా ప్రాంతీయ పార్టీలు, సంఘాలు, మేధావులను భాగస్వామ్యులుగా మార్చగలిగితే మంచిది.

## సుంకాల పోరులో ఇదీ మన కర్తవ్యం

ప్రపంచ దేశాలు ట్రంప్ ప్రారంభించనున్న సుంకాల సమరం అనుసరిస్తాయా లేదా అన్నది ఏప్రిల్ 2, 2025న తేలుతుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇతర దేశాల నుంచి దిగుమతి సరుకులపై శిక్షాత్మక సుంకాలు విధించేందుకు భారత్‌ను కూడా లక్ష్యంగా పెట్టుకున్నారు.ప్రపంచ దేశాలు ఆధునిక పైడ్ పైపర్ (సుప్రసిద్ధ జర్మన్ జానపద గాథలో వేణువు ఊది పిల్లలను వెంటబెట్టుకుని వెళ్లిన వ్యక్తి)ను అనుసరిస్తాయా లేదా అనేది ఏప్రిల్ 2, 2025న, ఆ తరువాత రోజుల్లో మనకు తెలుస్తుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించనున్న సుంకాల సమరం గురించి నేను ప్రస్తావిస్తున్నాను. లక్ష్యంగా పెట్టుకున్న ఇతర దేశాల నుంచి దిగుమతి అయిన సరుకులపై అమెరికా, శిక్షాత్మక సుంకాలు విధిస్తే, ఆ చర్య ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీవో) నిబంధనలను, బహుపక్షీయ వ్యాపార ఒడంబడికలను, అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలను ఉల్లంఘించడమే అవుతుంది. అయితే అమెరికా 47వ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చట్టాలను %-%అమెరికా అయినా, ఇతర దేశాలవి అయినా - కించిత్ కూడా లెక్క చేసే వ్యక్తి కాదు. అసలు ఆయనకు ఆయనే ఒక చట్టం కదా. తన మాటను అందరూ ఒక శిలా శాసనంగా పాటించాలని ఆయన ఆశిస్తారు. శిక్షాత్మక సుంకాల విధింపునకు ట్రంప్ కొన్ని 'టార్గెట్' దేశాలను గుర్తించారు. ఆ దేశాల నుంచి ఎంపిక చేసుకున్న దిగుమతి సరుకులపై పెద్ద ఎత్తున సుంకాలు విధించేందుకు ఆయన సంకల్పించారు. ఇందుకు ట్రంప్ గుర్తించిన దేశాల జాబితాలో భారత్ కూడా ఉన్నది.దేశీయ మార్కెట్‌లోకి ప్రవేశించి, దేశీ సరుకులతో పోటీ విదేశీ వస్తువులకు అవరోధాలు కల్పించేందుకు ఉద్దేశించినవే సుంకాలు. ఈ లక్ష్య పరిపూర్తికి సుంకాల (అంటే కస్టమ్స్ సుంకాలు)తో పాటు మరికొన్ని ఇతర పన్నులు (యాన్టి%-%డంపింగ్ డ్యూటీ అందుకొక ఉదాహరణ) కూడా విధించడం పరిపాటి. ప్రత్యేక పరిస్థితులలో వీటిని విధించడం ప్రతి దేశంలోను జరుగుతుంది. అయితే ఈ సుంకాలు లేదా పన్నులను సవాల్ చేయడమనేది సంబంధిత దేశీయ న్యాయస్థానాలలో మాత్రమే జరగాలి. కాగా అన్ని దేశాలలోను న్యాయస్థానాలు విదేశీ ఎగుమతిదారుల కంటే దేశీయ పరిశ్రమల ప్రయోజనాలను కాపాడేందుకు అధిక ప్రాధాన్యమిస్తాయని మరి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వీటితో పాటు సరుకుల నాణ్యతా ప్రమాణాల పరిరక్షణ, ప్యాకేజింగ్ ప్రమాణాలు, పర్యావరణ సంబంధిత మార్గదర్శకాలు పేరిట సుంకాలేతర అవరోధాలూ అమల్లో ఉంటాయి. ఈ స్వీయ లేదా స్వార్థ ప్రయోజనాన్నే సంరక్షణవాదంగా పరిగణిస్తారు. 'స్వయం సమృద్ధి' లేదా 'స్వావలంబన'కు దోహదం చేసే మార్గాలలో ఒకటి సంరక్షణవాదం. ఈ సంరక్షణవాదాన్ని దేశ భక్తిగా తికమక పడకూడదు. 'స్వయం సమృద్ధి' వాదాన్ని ఆధునిక అర్థశాస్త్రం. అనుభవిక రుజువులు తిరస్కరించాయి. స్వయం సమృద్ధి అనేది ఒక మిథ్య. ఏ దేశమూ తన ప్రజలు ఆకాంక్షిస్తున్న, వినియోగిస్తున్న సరుకులు, సేవలు అన్నిటినీ ఉత్పత్తి చేయలేదు దేశీయ పరిశ్రమల సంరక్షణకు ప్రాధాన్యమిచ్చే దేశం అల్ప ఆర్థికాభివృద్ధిని మాత్రమే సాధిస్తుంది.పెట్టుబడులను స్వల్పస్థాయిలో మాత్రమే సమకూర్చుకోగలుగుతుంది. నాసిరకం సరుకులను మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతుంది. తమ అభిరుచులకు అనుగుణంగా సరుకులను ఎంపిక చేసుకునేందుకు ప్రజలకు అవకాశముండదు. ఉత్పత్తిదారుల నుంచి వినియోగదారులకు అందే సేవలు నాణ్యమైనవిగా ఉండవు. సంరక్షణవాద విధానాలు కాక, స్వేచ్ఛా విపణి విధానాలే ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తులని గత యాభై సంవత్సరాల చరిత్ర నిర్ద్వంద్వంగా నిరూపించింది. ప్రపంచ సంపన్న దేశాలన్నీ పోటీదాయక ఆర్థిక విధానాలను, స్వేచ్ఛా వాణిజ్య పద్ధతులను అనుసరించినవే. భారత్ నాలుగు దశాబ్దాల పాటు సంరక్షణ విధానాలను అనుసరించింది. దిగుమతులపై ఆంక్షలు విధించింది. ఫలితంగా మన ఎగుమతులు పరిమితమయ్యాయి. అంతకంతకూ కుదించుకు పోయాయి. వాణిజ్య మంత్రిత్వ శాఖలో ఒక ప్రత్యేక విభాగం ఉన్నది. 'చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్' అన్న ఉన్నతాధికారి ఆధ్వర్యంలో పలువురు అధికారులు, ఉద్యోగులు ఆ విభాగంలో ఉన్నారు. అయితే ఒక ప్రశ్నను ఎవరూ లేవనెత్తలేదు: 'దిగుమతులపై నియంత్రణకు ఒక ప్రధానాధికారి ఉండడం అర్థం చేసుకోదగిన విషయమే. అయితే ఎగుమతుల నియంత్రణకు ప్రధానాధికారి ఎందుకు?'. విదేశీమారక ద్రవ్యం ఎంతగానో అవసరమున్న దేశంలో ఎగుమతులపై నియంత్రణకు ప్రత్యేకంగా ఒక ఉన్నతాధికారి ఎందుకు? ఈ ప్రశ్నను ఎవరూ అర్థం చేసుకోలేదు. 1991లో ఆర్థికమంత్రిగా డాక్టర్ మన్మోహన్‌సింగ్ నియమితులయ్యారు.ఆయన ఆర్థిక విధానాలు సంరక్షణవాదాన్ని త్యజించేందుకు దారితీశాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమయింది. 1991%-%92లో ప్రకటించిన కొత్త విదేశీ వాణిజ్య విధానం కాలం చెల్లిన వాణిజ్య నిబంధనలకు స్వస్తి చెప్పింది. భారత్ స్వేచ్ఛా వాణిజ్య విధానాలను పూర్తిగా అనుసరించడం ప్రారంభించింది. సంరక్షణ విధానాలు గతించిన చరిత్రగా మారిపోయాయి. ఆంక్షలను తొలగించారు. నియమ నిబంధనలను సరళీకరించారు. దిగుమతులపై సుంకాలను క్రమేణా తగ్గించారు. భారతీయ పారిశ్రామికవేత్తలకు విదేశీ పారిశ్రామిక వేత్తల నుంచి పోటీ ఎదురయింది. ఈ పోటీలో దేశీయ పారిశ్రామికవేత్తలు అద్భుత విజయాలు సాధించారు. ప్రపంచీకరణ విధానాలతో దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రయోజనాలు అపరిమితంగా సమకూరాయి. 2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు భారత్ మళ్లీ సంరక్షణవాదాన్ని అనుసరించడం ప్రారంభమయింది. స్వయం సమృద్ధి ఒక విచిత్ర పేరు ఆత్మ నిర్భరత ను సంతరించుకున్నది! ప్రపంచం ఎంతో మారిపోయిందన్న సత్యాన్ని గుర్తించడంలో మోదీ ప్రభుత్వం విఫలమయింది. అనేక దేశాలు తమ 'తులనాత్మక అనుకూలత'లను కనుగొన్నాయి. ఆ సానుకూలతలను తమకు ప్రయోజనకరంగా వినియోగించుకున్నాయి. 'సప్లై చైన్స్' (ఉత్పత్తి, సరఫరా ప్రక్రియల పరంపర) అనే కొత్త పద్ధతి అమలులోకి వచ్చింది. మొబైల్ ఫోన్ లాంటి ఒక పరికరం ఉత్పత్తి పూర్తిగా ఒక దేశంలో కాక, అనేక దేశాలలో జరగడం పరిపాటి అయింది. ఈ కొత్తఉత్పత్తి ప్రక్రియ సర్వసాధారణమైపోయింది. 'మేడ్ ఇన్ జర్మనీ', 'మేడ్ ఇన్ జపాన్' అనే ప్రతిష్ఠాత్మకత గతించిన విషయమైపోయింది.అనేక వస్తువులు 'మేడ్ ఇన్ ది వరల్డ్'గా ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి. మోదీ ప్రభుత్వ ఆత్మనిర్భర్ సాధించిందేమిటి? త్యజించిన నియమ నిబంధనలు, లైసెన్స్‌ల విధానం, ఆంక్షలు, మరీ ముఖ్యంగా సుంకాలను పునః ప్రారంభించడమే కాదూ? సరే, ట్రంప్ మహాశయుడు రెండోసారి అధికారానికి వచ్చిన కొద్ది రోజులకే సుంకాల సమరానికి నాందిగా మొదటి అస్త్రాన్ని ప్రయోగించాడు. అల్యూమినియం, ఉక్కు దిగుమతులపై సుంకాలు పెంచాడు. అయితే వెనుకడుగు వేసి ఆ సుంకాల వసూలును వాయిదావేసి, అందుకు కొత్త తేదీ నిర్దేశించాడు. మార్చి 26న ఆటోమొబైల్స్, వాటి విడిభాగాల దిగుమతులపై భారీ సుంకాలు విధించాడు. ట్రంప్ నిర్ణయాలు, చర్యలకు భారత్ ప్రతిస్పందన ఇంతవరకు గోప్యంగా, ప్రతి చర్యలు చేపట్టే రీతిలో ఉన్నది. 2025 - 26 కేంద్ర బడ్జెట్‌లో సుంకాల తగ్గింపును ప్రభుత్వం ప్రకటించింది. ఈ చర్య, ట్రంప్‌ను ఏమీ ప్రభావితం చేయలేదు. ఇండియాకు అనుకూలంగా ఆయన వైఖరిని మారగలదనే సూచనలు కనిపించడం లేదు. వైట్ హౌజ్ సమావేశంలో నరేంద్ర మోదీ మెరమెచ్చు మాటలు మాట్లాడారు. అయితే అవేమీ ట్రంప్‌ను సంతృప్తిపరచ లేదు. ద్రవ్య బిల్లును ఆమోదించిన సమయంలో డిజిటల్ సర్వీస్ ట్యాక్స్ ('గూగుల్ ట్యాక్స్)ను ఉపసంహరించుకున్నారు. అమెరికాకు మరిన్ని రాయితీలు ఇచ్చే విషయమై మోదీ ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. దేశ దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదిపివేయనున్న ట్రంప్ సుంకాల సమరాన్ని ఎదుర్కొనేందుకు ఇది సరైన దృక్పథమేనా? సరైనదనే భావన కలిగించే రీతిలో ప్రభుత్వ తీరు లేదు.భారత్ - అమెరికా పరస్పర ప్రయోజనాలకు మేలు కలిగే విధంగా సమస్త సుంకాల విషయమై సమగ్రంగా చర్చించాలి. తన స్నేహితుడు ట్రంప్ తత్వం మోదీకి బాగా తెలుసు కనుక సుంకాల విషయంలో తగ్గారు. ట్రంప్ నిర్దేశాలను పాటించేందుకు సుముఖమయ్యారు. అయితే భారత్ ప్రయోజనాలను సంరక్షించడంలో మోదీ సఫలమవుతారా లేదా అన్నది ఇప్పుడే స్పష్టంగా చెప్పలేము. ట్రంప్ ప్రారంభించనున్న సుంకాల యుద్ధంలో తన ప్రయోజనాలను రక్షించుకునేందుకు భారత్‌కు ఇతర దేశాల మద్దతు, సహాయ సహకారాలు ఎంతైనా అవసరం. అలాగే ఆ దేశాలకూ అమెరికాపై వాణిజ్య పోరులో విజయం సాధించాలంటే భారత్ మద్దతు తప్పనిసరి. కెనడా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా ఈ సుంకాల పోరులో భారత్‌తో కలిసివచ్చే దేశాలు. భారత్ అనుసరించాల్సిన వివేకవంతమైన మార్గమేమిటి? ఒక కలెక్టివ్‌గా ఏర్పడేందుకు ఆ దేశాలకు నచ్చజెప్పి అంగీకరించేలా చేసేందుకు భారత్ పూను కోవాలి. ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుకునేందుకు సంఘటితమైన ఈ మిత్ర దేశాలతో సమష్టిగా చర్చలు జరిపేలా అమెరికాను ఒత్తిడి చేయాలి. ట్రంప్ ప్రభుత్వంతో చర్చల ద్వారా ప్రపంచ దేశాల సుస్థిర ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే ఒక సమగ్ర ఒప్పందానికి రావాలి.

# రివర్స్ గేర్‌లో ఇండో



అమెరికాతో సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు మోదీ ట్రంప్‌తో వ్యక్తిగత స్నేహాన్ని పంచుకున్న భావన కలిగించారు. అయితే, 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' నినాదం ట్రంప్ విజయానికి దోహదపడలేకపోయింది. కానీ, 2025లో ట్రంప్ అధ్యక్షుడిగా గెలిచినప్పటికీ ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానం రాలేదు. మోదీకి ఆహ్వానం తెప్పించేందుకు మంత్రి జైశంకర్‌ను అమెరికాకు పంపారు. అయినా, అనుకున్నట్టు జరుగకపోగా, మోదీ స్థానంలో జైశంకర్‌కే ఆహ్వానం అందింది.అంతేకాకుండా, ట్రంప్ తన ప్రసంగంలో భారత దిగుమతులపై మరింత టారిఫ్ విధించనున్నట్టు, గ్రీన్‌కార్డును శాశ్వత నివాస హక్కుగా పరిగణించబోమని స్పష్టంగా చెప్పేశారు. దీంతో ట్రంప్‌ను ప్రసన్నం చేసుకునేందుకు మోదీ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అమెరికా దిగుమతులపై సుంకాలు తగ్గించేందుకు, ముఖ్యంగా టెస్లా కార్లపై సుంకాలను భారీగా తగ్గించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం భారతీయ ఆటోమొబైల్ కంపెనీలైన మహీంద్రా, టాటా, మారుతి వంటివాటిపై ప్రభావం చూపనున్నది. మన దేశం అమెరికాతో వాణిజ్య మిగులును కలిగి ఉన్నది. కొత్త ఒప్పందాల కారణంగా అది కాస్తా లోటుగా మారొచ్చు.ట్రంప్‌ను శాంతింపజేసే ప్రయత్నంలో భాగంగా మోదీ అమెరికా పర్యటనకు ముందు ఆర్థికమంత్రి నిర్మల హార్లే డేవిడ్సన్ మోటార్ సైకిళ్లపై దిగుమతి సుంకాన్ని 50 శాతం, టెస్లా కార్లపై 85 శాతం తగ్గించారు. ఈ ఏడాది నుంచి భారత దేశానికి 'మిలటరీ సేల్స్' (రక్షణ ఉత్పత్తులు)ను అనేక బిలియన్ డాలర్లకు పెంచనున్నట్టు ట్రంప్ చెప్పారు. దీన్ని కూడా అశుభసూచకంగానే భావించాలి. ఈ ఒప్పందాల పర్యవసానాలు భారత ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయి. అలాగే, ఎఫ్-16 విమానాల నిర్వహణ కోసం పాకిస్థాన్‌కు 397 మిలియన్ డాలర్లు కేటాయించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయం.. మోదీ దౌత్య సామర్థ్యంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నది. భారత భద్రతకు ప్రమాదం కలిగించే పాకిస్థాన్‌కు సహాయం చేయాలనే అమెరికా నిర్ణయంపై నిరసన తెలియజేసే ధైర్యం కూడా మోదీకి లేకుండాపోయింది.ఏప్రిల్ 2 నుంచి పరస్పర టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయి. ఇది భారత జీడీపీ వృద్ధి రేటును 0.5 శాతం నుంచి 0.6 శాతం వరకు దెబ్బతీయవచ్చు. అంతేకాకుండా, అమెరికా నుంచి ఎఫ్-35 యుద్ధ విమానాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తే, భారతదేశంలోని స్వదేశీ తయారీ తేజస్ ఫైటర్ జెట్ ప్రాజెక్ట్ అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉన్నది. రష్యా భారత్‌లోనే ఎస్‌యూ-57 యుద్ధ విమానాలను ఉత్పత్తి చేసేందుకు సిద్ధంగా ఉండగా.. మోదీ మాత్రం అమెరికా వైపు మొగ్గు చూపడం దేశ ప్రయోజనాలకు విరుద్ధమనే చెప్పాలి. అమెరికా నుంచి మక్కజొన్న, సోయాబీన్ల దిగుమతులను పెంచేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటే, భారతీయ రైతులు తట్టుకోలేరు. దిగుమతి సుంకాలను తగ్గిస్తే, భారత వ్యవసాయం తీవ్రంగా దెబ్బతింటుంది. అమెరికా కాంగ్రెస్ ఉమ్మడి సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. 'భారతదేశం 100 శాతం దిగుమతి సుంకం విధిస్తున్నది. ఇది అన్యాయం. ఏప్రిల్ 2 నుంచి భారత్ మాకు ఎంత పన్ను వేస్తే, మేమూ అంతే పన్ను వేస్తాం' అని తీవ్రంగా హెచ్చరించారు.ట్రంప్ ముందు మోదీ పూర్తిగా తలొంచినట్టు కనిపించారు. దీంతో 'భారత్ ఫస్ట్', 'జాతీయ ప్రయోజనాలు ఫస్ట్' అనే నినాదాలు నిస్సారంగా మారిపోయాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో 2005లో ఇండియా-అమెరికా డిఫెన్స్ ఫ్రేమ్‌వర్క్ అగ్రిమెంట్ కుదిరింది. దీనిద్వారా సీ-130 జే, సీ-17 గ్లోబ్ మాస్టర్ వంటి రక్షణ కొనుగోళ్లను భారత్ సాధించింది. అలాగే, 2008లో జరిగిన ఇండో-అమెరికా సివిల్ న్యూక్లియర్ ఒప్పందం అణుశక్తి రంగంలో భారత దేశానికి పెద్ద మైలురాయి అయింది. కానీ, మోదీ ప్రభుత్వం అమెరికా వాణిజ్య ఒత్తిళ్లకు లొంగిపోవడంతో, దేశ భద్రతా ప్రయోజనాలు, ఆర్థిక భవిష్యత్తు ప్రమాదంలో పడింది. మోదీ, ఆరెస్సెస్ థింక్ ట్యాంక్ కలిసి ప్రభుత్వానికి కొత్త వ్యూహాన్ని రూపొందించాల్సిన సమయం ఆసన్నమైంది. అర్థవంతమైన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉన్న విదేశాంగ విధానాన్ని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# తుమ్మిడిహట్టి- నీటి లభ్యత.. నిజానిజాలు!



ఈ నెల మార్చి 26న అసెంబ్లీలో సాగునీటి శాఖ పద్దులపై చర్చ సందర్భంగా రెండు అంశాలు వాగ్వివాదాలకు దారితీశాయి. 1.తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత ఉన్నదని సీడబ్ల్యూసీ చెప్పినా కాంట్రాక్టుల కోసం, కమీషన్ల కోసం బ్యారేజీ స్థలాన్ని మేడిగడ్డకు మార్చారు. 2.ప్రభుత్వమే నియమించిన రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించవద్దని చెప్పినా వారి మాటను పెడచెవిన పెట్టి బ్యారేజీని నిర్మించారు. ఈ రెండు అంశాల మీద మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సాగునీటి శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మధ్య వాగ్వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో పైన పేర్కొన్న రెండు అంశాల్లో వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఈ వ్యాసం రాయవలసి వస్తున్నది.152 మీటర్ల వద్ద తుమ్మిడిహట్టి బ్యారే జీ కోసం గత ప్రభుత్వం చేసిన కృషి: కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తుమ్మిడిహట్టి వద్ద 152 ఎఫ్ఆర్ఎల్‌తో తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించడానికి చిత్తశుద్ధితో ప్రయత్నం చేసింది. రాష్ట్రం ఏర్పడగానే అప్పటి సాగునీటి మంత్రి హరీశ్‌రావు 2014 జూలైలో ముంబై వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగునీటి మంత్రిగా ఉన్న ముష్రిఫ్‌తో సమావేశమయ్యారు. హరీష్‌రావు వద్ద ఓఎస్‌డీగా పనిచేస్తున్న నేనూ ముంబై వెళ్లాను. ఆ సమావేశంలో మహారాష్ట్ర మంత్రి.. 'కొద్ది నెలల్లోనే మా రాష్ట్రంలో ఎన్నికలు జరుగబోతున్నాయి. ఈ సమయంలో తుమ్మిడిహట్టిపై మేము ఏ నిర్ణయం తీసుకోలేం. ఎన్నికలైన తర్వాత ఏర్పడే కొత్త ప్రభుత్వాన్ని సంప్రదించండి' అని సలహా ఇచ్చాడు. ఇక చేసేదేమీ లేక మహారాష్ట్రలో ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడేదాకా వేచిచూడక తప్పలేదు.ఎన్నికల తర్వాత మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది. అప్పుడు అక్కడ మన తెలంగాణ బిడ్డ, బీజేపీ సీనియర్ నాయకులు చెన్నమనేని విద్యాసాగర్‌రావు గవర్నర్‌గా ఉన్నారు. తొలుత హరీశ్‌రావు మహారాష్ట్ర సాగునీటి మంత్రి గిరీశ్ మహాజన్‌తో చర్చించడానికి 2014 డిసెంబర్‌లో ముంబై, నాగ్‌పూర్‌కు వెళ్లారు. ఆయన వెంట నేనూ వెళ్లాను. అయితే.. 'ఇది నా స్థాయిలో తీసుకునే నిర్ణయం కాదు, ముఖ్యమంత్రుల స్థాయిలో జరుగవలసిన నిర్ణయం' అని గిరీశ్ మహాజన్ సెలవిచ్చారు. 2015, ఫిబ్రవరి 17న కేసీఆర్ తన పుట్టినరోజు వేడుకలను కూడా వదిలేసి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో చర్చల కోసం ముంబాయి వెళ్లారు. ఆ సమావేశం గవర్నర్ నివాసం రాజ్‌భవన్‌లో, ఆయన సమక్షంలోనే జరిగింది. ఆ సమావేశంలో పాల్గొనడానికి మంత్రి హరీశ్ రావుతో నేను కూడా ముంబాయి వెళ్లాను.తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద బ్యారేజీ నిర్మాణానికి ఆమోదం తెలుపమని కేసీఆర్ ప్రార్థించారు. మహారాష్ట్రలో ముంపునకు గురవుతున్న భూములకు మహారాష్ట్ర నిర్ధారించిన పరిహారాన్ని చెల్లిస్తామన్నారు. జవాబుగా ఫడ్నవీస్ స్పష్టంగా అన్నమాట ఏమంటే.. 'కేంద్రంలో కాంగ్రెస్, మహారాష్ట్రలో కాంగ్రెస్, ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే మహారాష్ట్ర ప్రభుత్వం 152 మీటర్ల ఎత్తుకు బ్యారేజీ నిర్మాణానికి అనుమతించలేదు. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమించి అరెస్టయిన నేను అనుమతి ఎట్లా ఇస్తాను? బ్యారేజీ ఎత్తును 4 మీటర్లు తగ్గించి 148 మీటర్ల వద్ద కట్టుకోండి. గోదావరి అవార్డు ప్రకారం మీరు ఎన్ని నీళ్లు తీసుకుపోయినా మాకు అభ్యంతరం లేదు.' ఇదీ గవర్నర్ సమక్షంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి అన్నమాటలు. ఇక వారితో సంప్రదింపులు అంటే కాలయాపన తప్ప మరేమీ ఉండదని కేసీఆర్ నిర్ధారణకు వచ్చారు.ఇదిలా ఉంటే 2015, మార్చిలో సీడబ్ల్యూసీ తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతపై ఒక లేఖ రాసింది. అందులో తుమ్మిడిహట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత ఉన్నదని పేర్కొన్న మాట వాస్తవమే. వారు అక్కడితో ఆగిపోలేదు. అందులో 63 టీఎంసీలపై రాష్ట్రాల వాటా కలిసి ఉన్నదని కూడా పేర్కొనారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు అవసరాలకు తగినన్ని నీళ్లు విశ్వసనీయంగా భవిష్యత్తులో లభ్యం కాకపోవచ్చునని స్పష్టంగా చెప్తూ ప్రాజెక్టు నుంచి మళ్లించే నీటి పరిమాణాన్ని పునఃసమీక్షించుకోమని హెచ్చరించారు. 4.3.2015న సీడబ్ల్యూసీ వారు ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌కు రాసిన లేఖలో పేరా 3, అనే ఉప శీర్షిక కింద పేరాలో రాసిన వాక్యాలను యథాతథంగా ఉల్లేఖిస్తున్నాను.పై మాటలు రాస్తూ ప్రాజెక్టు అవసరాలకు సరిపోయే నీరు భవిష్యత్తులో నికరంగా లభ్యం కాకపోవచ్చునని, నీటిని తరలించే పరిమాణాన్ని పునః పరిశీలించమని ప్రాజెక్ట్ అధికారులను హెచ్చరించింది. ఆ మాటలను కూడా యథాతథంగా ఉల్లేఖిస్తున్నాను.తుమ్మిడిహట్టి వద్ద లభ్యమయ్యే 75 శాతం విశ్వసనీయత కలిగిన 165 టీఎంసీలలో 3 రాష్ట్రాల నీటివాటాను తీసివేస్తే భవిష్యత్తులో తరలించే నీటి పరిమాణం 102 టీఎంసీలకు మించి కుదరదని తేలింది. ఇది బ్యారేజీని 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద నిర్మించినప్పుడే సాధ్యం. మహారాష్ట్ర తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎఫ్ఆర్ఎల్‌ని 148 మీటర్లకు తగ్గించమని పట్టుబడుతున్నది. 148 మీ ఎత్తు వద్ద తరలించే నీటి పరిమాణం 44 టీఎంసీలకు మించే అవకాశం లేదు అని ప్రాజెక్టు సిమ్యులేషన్ స్టడీస్‌లో తేలింది. అవి ఆదిలాబాద్ జిల్లా అవసరాలకే సరిపోతాయి. కాబట్టి మిగతా జిల్లాల అవసరాల కోసం, ప్రాజెక్టు మొత్తం 160 టీఎంసీల నీటి తరలింపునకు రూపకల్పన చేసి పనులు ప్రారంభించినందున అంతే, లేదా అంతకంటే ఎక్కువ నీరు లభ్యమయ్యే చోట బ్యారేజీని నిర్మించవలసిన అవసరం ఏర్పడింది. అందుకే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రీ ఇంజినీరింగ్ చేయాలని ప్రభుత్వం తలపోసింది.నీటి లభ్యతపై గతానుభవాలు: ఈ సందర్భంగా నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్‌లో మన అనుభవాలను గుర్తుచేసుకోవాలి. ఆ ప్రాజెక్టులు కట్టినప్పుడు పుష్కలంగా నీరు వచ్చేది. 1980వ దశకం వరకు ఈ స్థితి ఉండేది. పై రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రలు తమ వాటాను వినియోగించుకోవడానికి ప్రాజెక్టులు కట్టుకున్నప్పటి నుంచి మన ప్రాజెక్టుల్లోకి ప్రవాహాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఈ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో నికరంగా నీరు లభ్యం కాకపోవచ్చునన్న సీడబ్ల్యూసీ హెచ్చరికను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నది. వేల కోట్లు ఖర్చుచేసి నిర్మిస్తున్న ప్రాజెక్టుల సాఫల్యతను దృష్టిలో పెట్టుకోక తప్పదు. గతానుభవాల దృష్ట్యా ఇప్పుడు వస్తున్న నీళ్లను చూసి ప్రాజెక్టులపై ఖర్చుచేయలేం. వందేండ్ల పాటు ప్రాజెక్టు సాఫల్యతను దృష్టిలో పెట్టుకునే ప్రాజెక్టులను నిర్మిస్తారు. ఆ దృష్టితోనే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును 9 టీఎంసీల జూరాల జలాశయం నుంచి 215 టీఎంసీల శ్రీశైలం జలాశయానికి మార్చింది. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రీ ఇంజినీరింగ్ చేసేటప్పుడు కూడా ఆ దృష్టికోణంతోనే ప్రత్యామ్నాయ స్థలం కోసం అన్వేషించాం. ఆ అన్వేషణలో మేడిగడ్డ అనువైనదని తేలింది. ప్రముఖ ఇంజినీర్ దివంగత టి.హనుమంతరావు కూడా గోదావరి జలాల వినియోగానికి తాను రూపొందించిన ప్రతిపాదించిన 7 వరుస బ్యారేజీల్లో మేడిగడ్డ సమీపంలో ఉన్న సూరారం బ్యారేజీ ఒకటి. తుమ్మిడిహట్టి వద్ద భవిష్యత్తులో నికరంగా 165 టీఎంసీలు లభ్యం కాకపోవచ్చునని చెప్పిన సీడబ్ల్యూసీ మేడిగడ్డ వద్ద 284.3 టీఎంసీలు లభ్యమవుతాయని చెప్పడం గమనార్హం.మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణాన్ని రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ వ్యతిరేకించిందా?: మేడిగడ్డ బ్యారేజీని రిటైర్డ్ ఇంజినీర్లు వ్యతిరేకించారని, వారు వద్దన్నా మేడిగడ్డ వద్ద బ్యారేజీని నిర్మించిందని నిన్న అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీపై రిటైర్డ్ ఇంజినీర్లు ఏం చెప్పారు? వారు వ్యతిరేకించిన అంశం ఏమిటన్నది వారి నివేదికలోని వాక్యాలను చదివితే అర్థం అవుతుంది. తొలుత రీ ఇంజినీరింగ్‌లో మేడిగడ్డ నుంచి నేరుగా మిడ్‌మానేరు జలాశయానికి గోదావరి నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాదించింది. ఈ మార్గం సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడానికి ప్రభుత్వం రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీని ఏర్పాటుచేసింది. ఆ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లను కూలంకషంగా పరిశీలించి బ్యారేజీ నిర్మాణానికి మేడిగడ్డ స్థలం అనువైనదని, అయితే, మేడిగడ్డ నుంచి నేరుగా మిడ్ మానేరు జలాశయానికి నీటిని తరలించడం మాత్రం వీలుకాదని పేర్కొన్నది. ఆ మార్గంలో తాడిచర్ల బొగ్గు గనులు, సింగరేణి ఓపెన్ కాస్ట్ గనులు అందుకు అవరోధంగా ఉన్నాయని రిటైర్డ్ ఇంజినీర్లు తమ నివేదికలో పేర్కొన్నారు. వారు తమ నివేదికలో పేజీ 7లో రాసిన వాక్యాలను యథాతథంగా ఉల్లేఖిస్తున్నాను.మేడిగడ్డ బ్యారేజీ నుంచి నేరుగా నీటిని తరలించే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ వారి అభిప్రాయాన్ని పేజీ 8లో ఇట్లా వ్యక్తం చేశారు. నివేదిక చివరలో కూడా పేజీ 13లో కూడా ఇదే అంశాన్ని పొందుపరిచారు. అంతే తప్ప వారు మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని వ్యతిరేకించలేదు. ఆ తర్వాత రిటైర్డ్ ఇంజినీర్ల సూచన మేరకు మేడిగడ్డ మిడ్ మానేరు మార్గాన్ని త్యజించి మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి బ్యారేజీకి నీటిని గోదావరి నదీమార్గం ద్వారానే తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు వీలుగా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, వాటి అనుబంధ పంప్‌హౌజ్‌లను, 13 కిలోమీటర్ల గ్రావిటీ కాలువను కూడా ప్రభుత్వం నిర్మించింది.

## 9వ షెడ్యూల్ పేరుతో ఎగనామం!



రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ బిల్లులను తూతూ మంత్రంగా ఆమోదించి, రాష్ట్రంలో అమలుపరచకుండా ఢిల్లీకి పంపి చేతులు దులుపుకున్నది. 'తాంబూలం ఇచ్చాం, తన్నుకు చావండి' అన్న చందంగా బీసీ సంఘాల మధ్య తగువు పెట్టి, ఆ మంటల్లో రేవంత్ ప్రభుత్వం చలి కాగుతున్నది.'దేశవ్యాప్త కులగణన ద్వారా బీసీల స్థితిగతులను మార్చేస్తాం, వారి వాటా తేల్చి న్యాయం చేస్తాం' అని చెప్పిన రాహుల్‌గాంధీ ఇప్పుడు కులగణనతో ఏ పరిష్కారమూ లభించదని, అది వట్టి చెత్తబుట్టతో సమానం అంటున్నారు. కులగణనతో బీసీలకు రిజర్వేషన్లు అసాధ్యమని, అది కోర్టులో నిలబడదని చెప్తూ రాజ్యాంగ సవరణ, 9వ షెడ్యూల్ అనే కొత్త రాగం అందుకుంటున్నారు. ఈ దెబ్బతో బీసీల రిజర్వేషన్ల అంశం త్రిశంకు స్వర్గంలోకి నెట్టివేయబడింది. వాస్తవానికి కులగణన చేయడం, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలుపరచడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం ఇష్టం లేదు. అందుకే అశాస్త్రీయమైన కులగణన ద్వారా 51 శాతం ఉన్న బీసీల సంఖ్యను 46 శాతానికి తగ్గించి చూపెట్టారు.రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే, ముస్లింలకు సంబంధం లేకుండా 51 శాతం రిజర్వేషన్లను బీసీలకు అమలు చేయవచ్చు. కానీ, చేయడు. కనీసం తాను చేసిన కులగణన ద్వారా, తాను ప్రవేశపెట్టిన బీసీ బిల్లుల ద్వారా తక్షణమే రెండు జీవోలతో స్థానిక సంస్థలు-విద్య, ఉద్యోగ రంగాల్లో తాను చెప్తున్న 42 శాతం రిజర్వేషన్లనైనా అమలు పరచవచ్చు. కానీ, అమలుపరుచడు. ఎంతో ఆర్భాటంగా, ఖర్చుతో కూడిన కులగణన సర్వే రిపోర్ట్‌ను రేవంత్ సర్కార్ నిష్ప్రయోజనమైన డాక్యుమెంట్‌గా మార్చడానికి కుట్ర చేస్తున్నది.వాస్తవానికి రాజ్యాంగం రాష్ట్రాలకు కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించింది. ఆర్టికల్ 15 (4), ఆర్టికల్ 16 (4) ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు లేదా ఇతర సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం లేదని భావిస్తే.. వారికి సరైన ఆధారాలను (జనాభా లెక్కలు, ఇతర శాస్త్రీయమైన ఆధారాలు) గుర్తిస్తే రిజర్వేషన్లు ఇవ్వవచ్చని పేర్కొన్నది. కాబట్టి రాష్ట్రంలో కులగణన ద్వారా ఇప్పుడు సరైన ఆధారాలు, జనాభా లెక్కలు శాస్త్రీయంగా తేలాయి కాబట్టి నిశ్చింతగా రాష్ట్ర ప్రభుత్వమే రిజర్వేషన్లు అమలుపరచవచ్చు. అలాగే ఆర్టికల్ 242 ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికలు, రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రాలకు సంపూర్ణ అధికారాలు ఉన్నాయి.73వ రాజ్యాంగ సవరణ చట్టం (1992) ఆర్టికల్ 243 (ఓ) ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల వ్యవహారం కోసం, నియోజకవర్గాల ఏర్పాటు, నియోజకవర్గాల రిజర్వేషన్లు మొదలైనవాటికి సంబంధించిన వివాదాలను న్యాయస్థానాలలో సవాల్ చేయకూడదనే నిబంధనను చేర్చారు. కాబట్టి, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో తక్షణమే రిజర్వేషన్లను అమలుపరచవచ్చు. కానీ, సీఎం రేవంత్ సాకులు వెతుకుతున్నారు. 9వ షెడ్యూల్లో చేర్చడం, రాజ్యాంగ సవరణ, ఢిల్లీ దండయాత్ర అనే కొత్త పల్లవి, కొత్త ఎత్తుగడలతో రేవంత్ ప్రభుత్వం బీసీలను వంచిస్తున్నది.9వ షెడ్యూల్లో తెలంగాణ బీసీల రిజర్వేషన్ల అంశాన్ని చేర్చడమంటే దీన్ని సాగదీయడం, ఎగనామం పెట్టడమే. వాస్తవానికి 2007లో కేసులో.. 1973 తర్వాత 9వ షెడ్యూల్‌లో చేర్చిన వాటిపై సుప్రీంకోర్టుకు న్యాయ సమీక్ష చేసే అధికారం ఉంటుందని స్పష్టం చేసింది. అంటే 1973 తర్వాత చేర్చిన ఏ అంశంపైన అయినా సుప్రీం జోక్యం చేసుకోవచ్చు. అది రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉన్నదని సుప్రీం భావిస్తే దాన్ని కొట్టివేయవచ్చు. ఇవన్నీ తెలిసి కూడా కొద్దిమంది కాంగ్రెస్ మేధావులు 9వ షెడ్యూల్‌ను బ్రహ్మ పదార్థంగా, 9వ షెడ్యూల్లో చేరిస్తే బీసీల రిజర్వేషన్లకు రక్షణ ఉంటుందని, కోర్టులు ప్రశ్నించలేవని మభ్యపెడుతున్నారు. ఇది ఆత్మవంచనే అవుతుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ బీసీ మేధావులు ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఐక్య పోరాటానికి సిద్ధమైతేనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం. అందులో భాగంగానే ఈ నెల 29న హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో నిర్వహిస్తున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరై భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిద్దాం.

# ఆడవాళ్లలోనే ఆ ముప్పు



పురుషులతో పోలిస్తే మహిళల్లో గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువని అనేక అధ్యయనాలు తేల్చాయి. అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌తోపాటు యురోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ సంస్థ కూడా.. ఈ విషయాన్ని బలపరుస్తున్నాయి. ఆధునిక జీవనశైలి, చెడు ఆహారపు అలవాట్ల కారణంగా.. మహిళల్లో ఈ హృద్రోగ కేసులు పెరుగుతున్నాయి. వయసు పైబడటం, హార్మోన్ల ప్రభావం అతివల గుండెను బలహీనపరుస్తున్నాయి. అధిక రక్తపోటు, డయాబెటిస్ లాంటి దీర్ఘకాలిక రుగ్మతలు.. మహిళల్లో గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతున్నదట. రక్తంలో చక్కెర స్థాయులు పెరగడం వల్ల రక్త నాళాలు దెబ్బతింటాయి. ఫలితంగా రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడి స్ట్రోక్ వచ్చే అవకాశం పెరుగుతుంది. 55 ఏళ్లు దాటినవాళ్లలో గుండెజబ్బుల ముప్పు ఎక్కువగా ఉంటున్నదట. మెనోపాజ్ సమయంలో వచ్చే హార్మోన్ మార్పుల వల్ల.. రక్తంలో చక్కెర స్థాయులు పెరుగుతాయి. ఈస్ట్రోజన్ హార్మోన్ లెవెల్స్ తగ్గడం కూడా.. రక్తనాళాల్లో వాపు, అధిక రక్తపోటుకు కారణం అవుతుంది. ఇక.. పురుషులతో పోలిస్తే మహిళల రక్త ధమనులు ఇరుకుగా ఉంటాయట. ఫలితంగా వారిలో బీపీ పెరిగి.. గుండెపోటుకు దారి తీస్తుంది. వీటితోపాటు ఊబకాయం, మానసిక ఒత్తిడి, నిరాశ వంటివి కూడా ఆడవాళ్లలో హార్ట్ ఎటాక్స్ రావడానికి కారణం అవుతున్నాయి. అలాగే బ్రోకెన్ హార్ట్ సిండ్రోమ్, గర్భధారణ సమస్యలు లాంటి పరిస్థితులు కూడా.. గుండె జబ్బుల ప్రమాదానికి దోహదం చేస్తున్నాయి.

**లక్షణాలు వేరుగా..**

పురుషులతో పోలిస్తే.. మహిళల్లో గుండెపోటు లక్షణాలు వేరుగా ఉంటున్నాయని హృద్రోగ నిపుణులు అంటున్నారు. సాధారణంగా ఛాతీలో నొప్పి, శ్వాస ఆడకపోవడం, వికారం, తల తిరగడం, చలి చెమటలు పట్టడం.. కామన్‌గా కనిపించే లక్షణాలు. వీటితోపాటు ఆడవాళ్లలో మెడ, దవడ, గొంతు, కడుపుతోపాటు వీపుసహా వివిధ భాగాల్లో నొప్పిలాంటి లక్షణాలు ఉంటున్నాయట. వాంతులు, వికారం వంటివీ కనిపిస్తున్నాయట. అందుకే, ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

# అధిక బరువును తగ్గించే సూపర్ ఫుడ్స్ ఇవి తప్పక తినండి



అధిక బరువును తగ్గించుకునేందుకు చాలా మంది అనేక రకాలుగా ప్రయత్నిస్తుంటారు. కానీ బరువు తగ్గలేకపోతుంటారు. బరువు తగ్గడం కోసం డైట్ పాటించడం, యోగా లేదా వ్యాయామం చేయడం వంటివి చేస్తుంటారు. అయితే కొందరు ఎంత చేసినా బరువు తగ్గడం లేదని వాపోతుంటారు. కానీ అలాంటి వారు ఇప్పుడు చెప్పబోయే పలు ఆహారాలను తరచూ తింటుంటే దాంతో బరువు తగ్గడం తేలికవుతుంది. ఈ ఆహారాలు మీ శరీర మెటబాలిజంను పెంచుతాయి. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఫలితంగా శరీరంలో ఉండే కొవ్వు కరుగుతుంది. ఇక అధిక బరువును తగ్గించే ఆ ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. రాత్రి పూట నీటిలో ఖర్జూరాలను నానబెట్టాలి. గుప్పెడు మోతాదులో తీసుకుని నానబెట్టి మరుసటి రోజు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో తినాలి. ఇలా ఖర్జూరాలను ఉదయమే తింటుంటే శక్తి లభించడమే కాదు మెటబాలిజం కూడా పెరుగుతుంది. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చయి బరువు తగ్గుతారు. ఉదయం ఖర్జూరాలను తినడం వల్ల బరువు తగ్గవచ్చు. అధిక బరువు తగ్గాలనుకునే వారికి ఖర్జూరాలు ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇవి శరీరంలో వేడిని పెంచుతాయి కనుక చలికాలం తింటే శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవచ్చు. అధిక బరువును తగ్గించడంలో బాదంపప్పు, వాల్ నట్స్ కూడా ఎంతో మేలు చేస్తాయి. బాదంపప్పు, వాల్ నట్స్‌లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి అనేక రకాలుగా మనకు ఉపయోగపడుతాయి. శరీర మెటబాలిజంను పెంచి అధిక బరువును తగ్గిస్తాయి. కంటి చూపును మెరుగు పరుస్తాయి. కనుక బాదం పప్పు లేదా వాల్ నట్స్‌ను గుప్పెడు మోతాదులో తీసుకుని రాత్రి పూట నానబెట్టి మరుసటి రోజు ఉదయం తినాలి. ఇలా రోజూ తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఈ సీజన్‌లో మనకు చిలగడదుంపలు కూడా అధికంగానే లభిస్తాయి. ఇతర దుంపలకు ఇది పూర్తిగా భిన్నమైందని చెప్పవచ్చు. ఇతర దుంపలు బరువును పెంచుతాయి. కానీ చిలగడదుంపలు బరువును తగ్గిస్తాయి. ఎందుకంటే ఈ దుంపల్లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది బరువును తగ్గించడంలో సహాయం చేస్తుంది. అలాగే అటుకులతో చేసిన ఆహారం తింటున్నా కూడా బరువు తగ్గవచ్చు. ఇవి తేలిగ్గా జీర్ణమవుతాయి. వీటిల్లో ఉండే ఫైబర్ బరువును తగ్గించేందుకు సహాయం చేస్తుంది. నిమ్మజాతికి చెందిన పండ్లను తినడం వల్ల కూడా అధిక బరువును తగ్గించుకోవచ్చు. ఇలా పలు రకాల ఆహారాలను ఈ సీజన్‌లో తీసుకుంటే బరువును తగ్గించుకోవడం ఎంత మాత్రం కష్టం కాదు. చాలా సులభంగానే కొవ్వును కరిగించుకోవచ్చు.

# విద్యార్థుల మీద ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు ఓ పెట్టుబడి

తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లతోపాటు సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో కామన్ డైట్ మెనూ ప్రారంభించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. రంగారెడ్డి జిల్లా చిలుకూరులో స్కూళ్లు, హాస్టల్స్‌లో కామన్ డైట్ ప్రారంభించిన తెలంగాణ సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. గురుకులాల్లో విద్యార్థులకు సరికొత్త డైట్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. ఇప్పటివరకు ప్రైవేట్ స్కూల్స్‌లో చదివితేనే విద్యార్థులు రాణిస్తారనే అపోహ ఉండేదని, సంక్షేమ హాస్టల్స్‌లోని విద్యార్థుల్లో విశ్వాసం పెంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తొలిసారి సర్వేల్‌లో సంక్షేమ పాఠశాలను ప్రారంభించారని సీఎం గుర్తు చేశారు. సర్వేల్‌లో చదివిన అనేక మంది కీలక పదవులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం 8 ఏళ్లుగా డైట్ ఛార్జీలు పెంచలేదన్న సీఎం రేవంత్, డైట్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామన్నారు. కాస్మోటిక్ ఛార్జీలు కూడా పెంచి విద్యార్థులకు అండగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఎక్కువ ఫీజులు ఉన్న ప్రైవేట్ స్కూల్స్‌లో ఎక్కువ మంది చదువుతున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆలోచించాలి. విద్యార్థుల మీద ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు.. ఓ పెట్టుబడి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే సంక్షేమ హాస్టల్స్‌పై ఫోకస్ పెట్టింది తెలంగాణ ప్రభుత్వం. తనిఖీల పేరుతో ఇవాళ హాస్టల్స్ బాటపట్టింది. ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు ప్రభుత్వ యంత్రాంగం అంతా హాస్టల్స్, గురుకులాల్లో తనిఖీలు చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడి.. వాళ్లతో కలిసి భోజనాలు చేశారు. రంగారెడ్డి జిల్లా చిల్కూర్‌లో సోషల్? వెల్ఫేర్ ?రెసిడెన్షియల్ ?స్కూల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. అక్కడి నుంచే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో కామన్ డైట్ ప్లాన్ ప్రారంభించారు. అనంతరం, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఇక నుంచి ప్రతినెల 10న గురుకులాలు,హాస్టల్స్ బకాయిల చెల్లింపు జరుపుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. గ్రీన్‌ఛానల్ ద్వారా నేరుగా అకౌంట్లలో జమ చేస్తామన్నారు. ఇకపై ప్రతినెలా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు గురుకులాలు, హాస్టల్స్‌ను విధిగా పరిశీలిస్తారని సీఎం స్పష్టం చేశారు. గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్‌కు ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే, విద్యార్థుల్లో స్కిల్స్ కోసం టాటాగ్రూప్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని, ఇందులో భాగంగానే 75 ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని సీఎం ప్రకటించారు. ఐటీఐలో చేరితే ఉద్యోగం వస్తుందనే నమ్మకం కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అటు ఉమ్మడి ఖమ్మం జిల్లా బోనకల్‌లో బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. విద్యార్థులతో మాట్లాడి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని గిరిజన వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో పిల్లలతో కలిసి భోజనం చేశారు మంత్రి సీతక్క. అనంతరం, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనాల్లో క్వాలిటీ తగ్గితే సహించేది లేదని.. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులను సర్వీస్ నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

# నమ్మిన ప్రజలను నట్టేట ముంచి పండుగలా!



ఓ ఊరిలో పాముకాటుతో ఒకాయన చనిపోయాడట. కొందరు సావు కాడికిపోయి.. 'పాము ఏడ కరిచింది? కన్ను కింద కరిచిందా.. ఇంకా నయం కన్ను మీద కరవలేదు. కన్నుపోతుండె' అని వారు అన్నరట. మనిషే సచ్చిపోయిండు. ఇక పాము ఏడ కరిస్తే ఏంది? ఆడ కరిస్తే కన్ను పోతుండె.. ఈడ కరిస్తే కాలుపోతుండె అనడంలో అర్థం ఉందా? కేసీఆర్ అప్పట్లో చెప్పే ఈ కథ లెక్కనే ఉన్నది కాంగ్రెస్ పాలకుల పనితీరు. ఇంకా చెప్పాలంటే సంపినోడే సావుకాడికి పోయి సావు డప్పు కొట్టినట్టు ఉంది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచీ పాలమూరును నిర్లక్ష్యం చేసిందే కాంగ్రెస్ పార్టీ. పక్కనే కృష్ణా నది ప్రవహిస్తున్నా సాగు నీళ్లు అందించలేని అసమర్థత కాంగ్రెస్ పాలకులది. ఉమ్మడి ఏపీని 40 ఏండ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ.. ప్రాజెక్టులు నిర్మించి పాలమూరుకు నీళ్లివ్వలేకపోయింది. ఏటికేడు ప్రాజెక్టుల నిర్మాణాన్ని సాగదీసే చరిత్ర ఉన్న హస్తం పాలకులు నేడు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో మిగిలిన 10 శాతం పనులను కూడా పూర్తి చేయలేకపోతున్నారు. నాటి కాంగ్రెస్ పాలకుల చేతకాని పాలనే పాలమూరుకు వలసల జిల్లా అనే పేరు తెచ్చిపెట్టింది. నేటి పాలకులు కూడా అదే బాటలో నడుస్తున్నారు. అంతేకాదు, 'పాలమూరు మాదిగలు డప్పులు కొట్టాలె.. మనది మాదిగల జిల్లా' అంటూ ముఖ్యమంత్రి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఎన్ని జన్మలెత్తినా కాంగ్రెస్ పార్టీ పాలమూరుకు చేసిన అన్యాయానికి ప్రాయశ్చిత్తం లభించదు. సకలజనుల వనరులను సర్వనాశనం చేసి, జలహారతులిచ్చి 'మా నీళ్ల తీసుకుపోండి' అని నీళ్ల దోపిడీకి సహకరించిన పార్టీ మళ్లీ అందలమెక్కడం మన ఖర్మ. నాటి పరాయి పాలనలో జరిగిన విధ్వంసాన్ని రూపుమాపి, జల వనరులు సృష్టించిన మనీషి కేసీఆర్. సాగు, తాగునీరు అందించడమే కాకుండా రైతుబంధు ఇచ్చి రైతన్నల మోములో చిరునవ్వులు పూయించింది కేసీఆర్ సర్కార్. కేసీఆర్ హయాంలో పాలమూరు జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో గ్రామ దేవతలను కొలుస్తూ దాదాపు 40 ఏండ్ల తర్వాత పెద్దావర పండుగను రైతాంగం ఘనంగా జరుపుకొన్నది. ఆ సంబరాలు ఎంతో కాలం ఉండవంటూ మార్పు అనే పేరుతో వచ్చిన కాంగ్రెస్ సకల విధ్వంసాలు సృష్టిస్తున్నది. ఆనాటి రోజులు తెస్తామని చెప్పినట్టే నాటి నిర్లక్ష్యపు పాలన మళ్లీ తీసుకొచ్చింది నయవంచక కాంగ్రెస్. తాను పాలమూరు బిడ్డనని, పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తెస్తానని చెప్పి ఉన్న ప్రాజెక్టును పడావు పెట్టిన్రు. అంతేకాదు, నారాయణపేట– కొడంగల్ ప్రాజెక్టు పేరుతో సగం పాలమూరును మళ్లీ ఎడారి చేసే ప్రయత్నం చేస్తున్నారు. రైతాంగాన్ని సకల విధాలుగా ధ్వంసం చేసి రైతు పండుగలంటూ హడావుడి చేస్తున్నారు. అసలెందుకు రైతు పండుగలు జరుపుతున్నట్టు? పచ్చబడ్డ పాలమూరును ఎండబెట్టినందుకా? జాతీయ హోదా తీసుకొస్తానని చెప్పి ప్రాజెక్టును పడావు పెట్టినందుకా? రైతు భరోసా ఇస్తనని చెప్పి కనీసం రైతుబంధు ఇవ్వలేకపోతున్నందుకా? బోనస్‌ను బోగస్ చేసినందుకా? పాలమూరు బిడ్డకు ఒకింత ప్రేమ ఎక్కువ ఉంటదని నమ్మిన ప్రజలను నట్టేట ముంచినందుకా? పండుగలను దండుగ చేసి ప్రచార ఆర్భాటాల కోసం పండుగలు చేస్తే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు. పుట్టిన గడ్డకు సేవ చేసే అవకాశం కోసం చాలామంది ఎదురుచూస్తుంటారు. కానీ, పాలమూరు బిడ్డ మాత్రం వచ్చిన అవకాశాన్ని కృష్ణానది పాల్జేశారు. ఈ ఏడాదికాలంలో పాలమూరుకు ఒరిగిందేమిటి? ఇప్పటికైనా ప్రచార ఆర్భాటాలు మానుకొని, పాలనపై దృష్టిపెడితే కనీసం పాలమూరు ఆత్మగౌరవాన్ని నిలబెట్టినవారు అవుతారు.

# నచ్చినోళ్లపైనే దోమల దాడి



రాజమౌళి సినిమాలో.. విలన్‌ను టార్గెట్ చేసిన 'ఈగ'ను తెగ ఎంజాయ్ చేశాం! ఆ 'ఈగ'కు మేమేం తక్కువ కాదంటున్నాయి దోమలు. నలుగురిలో ఒకరిని టార్గెట్ చేయడం వాటికి సరదా! రక్తం రుచి నచ్చితే.. ఎంత అదరగొట్టినా అవి బెదరవు. మన శరీరం నుంచి వెలువడే వాసనలు దోమలకు స్వాగత గీతికలు అవుతాయి. అపరిశుభ్రతే వాటికి మన శరీరంపై దాడిచేసేలా ప్రోత్సహిస్తాయి. అందుకే, ఒకేచోట నలుగురు ఉన్నా.. దోమలు అందరినీ ఒకేలా కుట్టవు. ఒకరిద్దరిపైనే తెగ దాడి చేస్తుంటాయి.

**వాసనలు పసిగట్టి..**

ఒక్కొక్కరి నుంచి వచ్చే చెమటను బట్టి వారి చర్మం వాసన ఒక్కోరకంగా ఉంటుంది. వీటిని బట్టికూడా దోమలు ఆకర్షితమవుతాయి. శరీరం ఎక్కువగా చెమట పడితే.. చర్మంపై ఉండే బ్యాక్టీరియా యాక్టివేట్ అవుతుంది. అది కార్బాక్సిలిక్ యాసిడ్‌ను విడుదల చేస్తుంది. ఈ యాసిడ్ దోమలను ఎక్కువగా ఆకర్షిస్తుందని పలు అధ్యయనాల్లో తేలింది. కాబట్టి, వ్యాయామం, శారీరక శ్రమ ఎక్కువగా చేసిన తర్వాత స్నానం చేయడం అవసరం. దీనివల్ల శరీరం శుభ్రపడి, చెమట వాసన తగ్గి.. దోమలు దరిచేరే అవకాశాలు తగ్గుతాయి.

**బ్లడ్ గ్రూప్‌ను బట్టి..**

వాటికి నచ్చిన బ్లడ్‌గ్రూప్ ఉన్నవారినే దోమలు ఎక్కువగా కుడతాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ ఎంటమాలజీ నిర్వహించిన ఓ అధ్యయనం తేల్చింది. ఓ పాజిటివ్, ఓ నెగటివ్ బ్లడ్‌గ్రూప్ వ్యక్తులనే దోమలు ఎక్కువగా కుడతాయట. ఆ తర్వాతి స్థానం.. ఏ బ్లడ్ గ్రూప్ వ్యక్తులది. ఈ మూడు బ్లడ్ గ్రూప్‌లు ఉన్నవారితో పోలిస్తే.. మిగతా వారికి దోమల బెడద కాస్త తక్కువగానే ఉంటుందట. అందుకే.. ఓ, ఏ బ్లడ్ గ్రూప్ ఉన్నవారు దోమల నుంచి తప్పించుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 'చలి'తోపాటే దోమలూ విజృంభిస్తాయి. చర్మాన్ని సూదుల్లా గుచ్చి.. రక్తాన్ని పీల్చేస్తుంటాయి. లేనిపోని అనారోగ్యాలకు గురిచేస్తుంటాయి. దోమల్లో 3,500 కన్నా ఎక్కువ జాతులున్నా.. కేవలం ఆడ దోమలు మాత్రమే మనిషిని కుడతాయి. ఎందుకంటే.. ఆడ దోమల్లో గుడ్లు ఎదగాలంటే.. ప్రోటీన్లు అవసరం అవుతాయి. అవి మనిషి రక్తం నుంచే లభిస్తాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. దోమలు కొందరినే టార్గెట్ చేసి వారినే ఎక్కువగా కుడుతుంటాయి. ఇందుకు ప్రత్యేక కారణాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**కాక్‌టెయిల్ రుచి మరిగి..**

మనిషి మనిషికీ శరీరతత్వంలో కొన్నిమార్పులు కనిపిస్తాయి. శరీరం నుంచి వెలువడే వాసనలు, ఉష్ణోగ్రతలు వేర్వేరుగా ఉంటాయి. వీటితోపాటు వాళ్లు వేసుకునే దుస్తుల రంగులను బట్టికూడా దోమలు మనుషులను టార్గెట్‌గా చేసుకుంటాయని సెయింట్ లూయిస్ (అమెరికా)లోని ట్రైసన్ రీసెర్చ్ సెంటర్ పరిశోధకులు చెబుతున్నారు. కొన్నిజాతుల దోమలు ఈ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తాయట! వాటి ప్రవర్తన కూడా చాలా వింతగా ఉంటుందని పరిశోధకులు తేల్చారు. మనిషి చర్మం.. కొన్ని రసాయనాలతో కూడిన ప్రత్యేకమైన కాక్‌టెయిల్‌ను వాయు రూపంలో అతి స్వల్పంగా బయటికి విడుదల చేస్తుందట. ఈ కాక్‌టెయిల్ వాసన భిన్నంగా ఉన్నవారి వైపు దోమలు ఎక్కువగా ఆకర్షితం అవుతుంటాయట.

**కార్బన్ డయాక్సైడ్‌తో జాడ..**

మనిషి శ్వాస ద్వారా బయటికి వదిలే కార్బన్ డయాక్సైడ్ కణాలు.. దోమలను ఎక్కువగా ఆకర్షిస్తాయి. వీటిద్వారా 30 అడుగుల దూరం నుంచే.. దోమలు మనిషి జాడను గుర్తిస్తాయి. అంతేకాదు.. కార్బన్ డయాక్సైడ్ విడుదలయ్యే రేటును బట్టికూడా ఆకర్షణ ఆధారపడి ఉంటుందట. గర్భిణులు, వ్యాయామాలు ఎక్కువగా చేసేవారు, జీవక్రియ రేట్లు అధికంగా ఉండేవారి నుంచి ఎక్కువ మొత్తంలో కార్బన్ డయాక్సైడ్ విడుదల అవుతుంటుంది. అందుకే.. వారిని దోమలు ఎక్కువగా కుట్టే అవకాశం ఉంటుంది.

**ముదురు రంగులేస్తే.. మూడినట్టే!**

ఓ అధ్యయనం ప్రకారం.. నారింజ, ఎరుపు రంగుల తరంగ దైర్ఘ్యాలకు దోమలు ఎక్కువ ఆకర్షితం అవుతుంటాయని తేలింది. దోమలకు స్పష్టమైన చూపు ఉండదనీ, అందుకే కొన్ని ప్రత్యేక రంగులను మాత్రమే అవి గుర్తించగలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే, లేత రంగుల దుస్తులను ధరిస్తే.. దోమల బెడద నుంచి తప్పించు కోవచ్చని సూచిస్తున్నారు

**వేడివేడిగా..**

దోమలు వేడి వాతావరణాన్ని ఇష్టపడతాయి. మనిషి శరీర ఉష్ణోగ్రతను బట్టికూడా వారిని కుట్టాలా? వద్దా? అనేది దోమలు నిర్ణయించుకుంటాయట. ఇక సువాసనలు వెదజల్లే సబ్బులు వాడేవాళ్లను కూడా దోమలు ఎక్కువగా కుడుతాయి. ఆ సబ్బుల్లోని సువాసనల ప్రభావం.. చర్మంపై చాలాసేపటి వరకు ఉంటుంది. అది దోమలను ఎక్కువగా ఆకర్షిస్తుంది. అందుకే.. చలికాలంలో అలాంటి సబ్బులను వాడకుండా ఉంటే మంచిదని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు.

# రాజస్థాన్?లో ఈ ప్రదేశాలు ఔరా అనిపిస్తాయి ఒక్కసారైన చూడాలి



దేశంలో అత్యధిక వేడి ప్రాంతం రాజస్థాన్.. థార్ ఎడారి లో ఉన్న ఈ ప్రాంతం అత్యంత ఉష్ణోగ్రత కలిగి అయినప్పటికీ.. రాజస్థాన్ సహజ సౌందర్యం చాలా మంది ప్రయాణికులను ఆకర్షిస్తుంది. రాజస్థాన్‌లోని కొన్ని ప్రదేశాలు వర్షాకాలం లేదా శీతాకాలంలో మరింత అందంగా మారుతాయి. వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం రండి. మౌంట్ అబూ: రాజస్థాన్‌లోని మౌంట్ అబూ రాష్ట్రంలోని ఆకర్షణీయమైన ప్రదేశం. ఈ ప్రదేశము హనీమూన్ డెస్టినేషన్‌గా కూడా పరిగణించబడుతుంది. ఈ ప్రదేశం ఎల్లవేళలా పచ్చదనం ఉన్నప్పటికీ, వర్షాకాలంలో ఈ ప్రదేశం మరింత అందంగా కనిపిస్తుంది.

మౌంట్ అబూ: రాజస్థాన్‌లోని మౌంట్ అబూ రాష్ట్రంలోని ఆకర్షణీయమైన ప్రదేశం. ఈ ప్రదేశము హనీమూన్ డెస్టినేషన్‌గా కూడా పరిగణించబడుతుంది. ఈ ప్రదేశం ఎల్లవేళలా పచ్చదనం ఉన్నప్పటికీ, వర్షాకాలంలో ఈ ప్రదేశం మరింత అందంగా కనిపిస్తుంది.

1 / 5

భంగర్ కోట: చిన్న పర్వతాల మధ్య ఉన్న భంగర్ కోట వర్షం కారణంగా పచ్చదనంతో కనుల విందు చేస్తుంది. దెయ్యాల కోటగా గుర్తింపు పొందిన ఈ కోట అందాలు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి.

భంగర్ కోట: చిన్న పర్వతాల మధ్య ఉన్న భంగర్ కోట వర్షం కారణంగా పచ్చదనంతో కనుల విందు చేస్తుంది. దెయ్యాల కోటగా గుర్తింపు పొందిన ఈ కోట అందాలు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి.

2 / 5

ఉదయపూర్ సిటీ: అనేక చారిత్రాత్మక కట్టడాలు ఉన్న ఉదయపూర్ రాచరిక శైలికే కాకుండా పచ్చదనానికి కూడా పేరుగాంచింది. ఉదయపూర్‌లో అనేక పర్వతాలు ఉన్నాయి. వర్షాకాలం తర్వాత వాటి అందం మరింత పెరుగుతుంది.

ఉదయపూర్ సిటీ: అనేక చారిత్రాత్మక కట్టడాలు ఉన్న ఉదయపూర్ రాచరిక శైలికే కాకుండా పచ్చదనానికి కూడా పేరుగాంచింది. ఉదయపూర్‌లో అనేక పర్వతాలు ఉన్నాయి. వర్షాకాలం తర్వాత వాటి అందం మరింత పెరుగుతుంది.

3 / 5


జైపూర్ సిటీ: రాజస్థాన్‌లో చూడదగ్గ ప్రదేశాల విషయానికి వస్తే, జైపూర్ నగరాన్ని బెస్ట్ ఎంపిక. దీనిని పింక్ సిటీ అని కూడా పిలుస్తారు. జైపూర్‌లోని అంబర్ ఫోర్ట్‌తో సహా అనేక చారిత్రక ప్రదేశాల అందాలను పర్యాటకులు ఇష్టపడతారు.

జైపూర్ సిటీ: రాజస్థాన్‌లో చూడదగ్గ ప్రదేశాల విషయానికి వస్తే, జైపూర్ నగరాన్ని బెస్ట్ ఎంపిక. దీనిని పింక్ సిటీ అని కూడా పిలుస్తారు. జైపూర్‌లోని అంబర్ ఫోర్ట్‌తో సహా అనేక చారిత్రక ప్రదేశాల అందాలను పర్యాటకులు ఇష్టపడతారు.


4 / 5

జాలోర్: దీన్ని సిటీ అఫ్ గ్రానైట్ అండ్ గ్రాండ్యుర్ అని పిలుస్తారు. జలోర్ కోటలోని 'టోప్ ఖానా' లేదా ఫిరంగి ఫౌండ్రీ జలోర్‌లోని ప్రముఖ పర్యాటక ఆకర్షణ. ఈ నగరం దాదాపు 900 సంవత్సరాల క్రితం నిర్మించబడిన సుంధ మాత ఆలయానికి కూడా ప్రసిద్ధి చెందింది మరియు దేవత చాముండ దేవి భక్తులకు పవిత్రమైనది.

జాలోర్: దీన్ని సిటీ అఫ్ గ్రానైట్ అండ్ గ్రాండ్యుర్ అని పిలుస్తారు. జలోర్ కోటలోని 'టోప్ ఖానా' లేదా ఫిరంగి ఫౌండ్రీ జలోర్‌లోని ప్రముఖ పర్యాటక ఆకర్షణ. ఈ నగరం దాదాపు 900 సంవత్సరాల క్రితం నిర్మించబడిన సుంధ మాత ఆలయానికి కూడా ప్రసిద్ధి చెందింది మరియు దేవత చాముండ దేవి భక్తులకు పవిత్రమైనది.







తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY



## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్ డీఏ 2 శాతం పెంపుకు కేబినెట్ ఆమోదం



కేంద్ర ప్రభుత్వంలోని ఉద్యోగులకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డియర్‌నెస్ అలవెన్స్ (కరవు భత్యం) 2 శాతం పెంచింది. డీఏ పెంపు ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్రవేసింది. తాజా నిర్ణయంతో జూలై ఒకటి నుంచి చెల్లించాల్సిన డియర్‌నెస్ అలవెన్స్ రేటు 53శాతం నుంచి 55శాతానికి పెరిగింది. కేంద్రం నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంలోని దాదాపు కోటిమందికిపైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరనున్నది. ఇందులో 48లక్షల మంది ఉద్యోగులు, 67లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు. ప్రస్తుతం 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఉద్యోగుల జీతభత్యాలు నిర్ణయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. ఇది జనవరి, జూలైల్లో జరగాల్సి ఉన్నప్పటికీ ఏటా మార్చి, అక్టోబరులో ప్రకటిస్తూ వస్తోంది. ఆలస్యంగా ప్రకటించినా.. బకాయిలతో కలిపి జనవరి, జూలై నుంచే చెల్లిస్తారు. ముఖ్యంగా డీఏ సవరణ కోసం ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఇదే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. గతేడాది అక్టోబర్‌లో దీపావళి కానుకగా డీఏ 3 శాతం పెంచిన విషయం తెలిసిందే. కేంద్రం డీఏను సవరించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది.

## 1 ముకేశ్ 2 అదానీ

**రూ.8.6 లక్షల కోట్ల సంపదతో ఆసియా శ్రీమంతుడు**

**రూ.8.4 లక్షల కోట్లతో ఆ తర్వాతి స్థానంలో గౌతమ్**

**దేశ జీడీపీలో మూడోవంతు 284 మంది కుబేరుల సంపద**

**హురున్ ఇండియా జాబితాలో వెల్లడి..**





తెలుగు టాప్-10 శ్రీమంతుల జాబితా

| ర్యాంక్ | పేరు | సంపద(బిలియన్ డాలర్లలో) |
|---|---|---|
| 280 | మురళీ దివిస్ | 10 |
| 800 | పీపీ రెడ్డి | 5.8 |
| 825 | పీవీ కృష్ణా రెడ్డి | 5.6 |
| 1122 | ప్రతాప్ రెడ్డి | 3.3 |
| 1122 | పీవీ రాంప్రసాద్ రెడ్డి | 3.3 |
| 1198 | పీ పార్థసారథి రెడ్డి | 3.1 |
| 1624 | కే సతీష్ రెడ్డి | 2.3 |
| 1798 | ఎస్ సుబ్రమణ్యా రెడ్డి | 2.1 |
| 1798 | సీ వెంకటేశ్వర రెడ్డి | 2.1 |
| 1798 | ఎం సత్యనారాయణ | 2.1 |

దేశీయ శ్రీమంతుడు ముకేశ్ అంబానీ సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. గడిచిన ఏడాదికాలంలో ఆయన సంపద 13 శాతం తరిగిపోయి రూ.8.6 లక్షల కోట్లకు పరిమితమైనట్లు ప్రస్తుత సంవత్సరానికిగాను హురున్ ఇండియా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అయినప్పటికీ దేశీయ శ్రీమంతుల జాబితాలో తొలిస్థానంలో నిలిచినట్లు పేర్కొంది. కానీ, ప్రపంచవ్యాప్తంగా 100 బిలియన్ డాలర్ల సంపద కలిగిన కుబేరుల జాబితా నుంచి వైదొలిగినప్పటికీ ఆసియా కుబేరుడిగా కొనసాగుతుండటం విశేషం. కానీ, ఇదే సమయంలో అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ లక్ష కోట్ల రూపాయల సంపదను పోగేసుకొని ఈ జాబితాలో రెండో స్థానంలో నిలిచినట్లు నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది జనవరి 15తో ముగిసిన ఏడాదికాలంలో గౌతమ్ అదానీ రూ.8.4 లక్షల కోట్ల సంపదను కలిగివున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం భారత్‌లో 284 మంది బిలియనీర్లు ఉండగా, వీరి సంపద ఏడాది ప్రాతిపదికన 10 శాతం ఎగబాకి రూ.98 లక్షల కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. లేదా దేశ జీడీపీలో మూడోవంతు వీరివద్ద ఉన్నది.

### చైనాను అధిగమించిన భారత్...

భారత్ మరో రికార్డు సృష్టించింది. కుబేరుల సరాసరి సంపదలో తన పొరుగు దేశమైన చైనాను అధిగమించి రికార్డు నెలకొల్పింది. భారత్‌లో ఒక్కొక్కరి సంపద రూ.34,514 కోట్లు కాగా, అదే చైనాలో ఇది రూ.29,027 కోట్లుగా ఉన్నది. మరోవైపు, 175 మంది బిలియనీర్ల సంపద పెరగగా, 109 మంది సంపద హరించుకుపోయింది.

### ప్రపంచ కుబేరుడిగా ఎలాన్ మస్క్....

టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 420 బిలియన్ డాలర్ల వ్యక్తిగత సంపదతో ప్రపంచ కుబేరుల జాబితాలో తొలిస్థానంలో నిలిచారు. గడిచిన ఏడాదికాలంలో ఈ సంస్థ అంచనాలకుమించి రాణించడం వల్లనే సంపద భారీగా పెరగడానికి ప్రధాన కారణం. అలాగే ఈ జాబితాలో 266 బిలియన్ డాలర్లతో అమెజాన్ ఫౌండర్ జెఫ్ బెజోస్ రెండో స్థానంలో నిలువగా.. మెటా కో-ఫౌండర్, సీఈవో మార్క్ జుకర్‌బర్గ్(242 బిలియన్ డాలర్లు), ఒరాకిల్ కో-ఫౌండర్ ల్యారీ ఎల్లిసన్(203 బిలియన్ డాలర్లు), బర్క్‌షైర్ హ్యాథ్‌వేస్ సీవో వారెన్ బఫెట్(167 బిలియన్ డాలర్లు) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు.

## రాణించిన బ్యాంకింగ్ షేర్లు లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. ఆటో దిగుమతులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించడంతో మార్కెట్లు గురువారం ఉదయం నష్టాల్లో మొదలయ్యాయి. బ్యాంకింగ్ రంగంలో కొనుగోళ్లు కనిపించాయి. ఆటో, ఫార్మా, టెలికాం షేర్లు సహా మిగతా అన్నిరంగాల సూచీలు లాభాల్లోనే ట్రేడయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 77,087.39 పాయింట్ల వద్ద నష్టాల్లోనే మొదలైంది. ఇంట్రాడేలో 77,082.51 పాయింట్ల కనిష్ఠానికి చేరుకున్న సెన్సెక్స్.. గరిష్ఠంగా 77,747.46 పాయింట్లకు పెరిగింది. చివరలో 317.93 లాభంతో 77,606.43 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 105.10 పాయింట్లు లాభపడి 23,591.95 వద్ద స్థిరపడింది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం పెరగ్గా.. స్మాల్ క్యాప్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం వృద్ధిని నమోదు చేసింది. ట్రంప్ టారిఫ్‌లపై అనిశ్చితి కారణంగా ఫార్మా స్టాక్స్ ఒత్తిడికి గురయ్యాయి. ఆటో ఒకశాతం తగ్గగా.. ఫార్మా 0.4శాతం పతనమైంది. ఇక మిగతా అన్నిరంగాల సూచీలు పెరిగాయి. మీడియా, చమురు, గ్యాస్, రియాల్టీ ఒక్కొక్కటి ఒక శాతం వరకు పెరిగాయి. నిఫ్టీలో హీరో మోటోకార్ప్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎన్‌టీపీసీ లాభాలను ఆర్జించగా.. టాటా మోటార్స్, సన్ ఫార్మా, ఐషర్ మోటార్స్, మారుతి సుజుకి, భారతి ఎయిర్‌టెల్ నష్టపోయాయి. సోనా బీఎల్‌డబ్ల్యూ, హ్యాపీయెస్ట్ మైండ్స్, మెట్రో బ్రాండ్స్, మహీంద్రా లైఫ్, బజాజ్ ఎలక్ట్రికల్స్, జెన్సోల్ ఇంజినీరింగ్, వక్రంగీ, టీసీఐ ఎక్స్‌ప్రెస్, శివ సిమెంట్, రోలెక్స్ రింగ్స్, ఎక్స్‌ప్లియో సొల్యూషన్, బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్, సుయోగ్ టెలి, గెలాక్సీ సర్ఫ్యాక్టెంట్స్ తదితర 460 స్టాక్‌లు బీఎస్‌ఈలో 52 వారాల కనిష్ఠ స్థాయికి చేరుకుంది.

## ట్రంప్ దెబ్బకు ఆటో విలవిల.. దిగుమతయ్యే వాహనాలపై 25 శాతం సుంకం

**వచ్చే వారం నుంచి అమల్లోకి కొత్త పన్ను**

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనిచేశారు. విదేశాల్లో తయారై అమెరికాకు దిగుమతయ్యే కార్లపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు తాజాగా ప్రకటించారు. కానీ, అమెరికాలో తయారైన కార్లపై ఎలాంటి సుంకం ఉండదని స్పష్టంచేయడం విశేషం. ఈ సుంకం పెంపు వచ్చే వారం నుంచి అమలులోకి రానున్నట్లు ప్రకటించారు. ఇది శాశ్వతమైన చర్యగా పేర్కొన్న ఆయన.. దీంతో అమెరికా ఆర్థిక వ్యవస్థకు ప్రతియేటా 100 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరనున్నదని పేర్కొన్నారు. ఈ నిర్ణయం విదేశీ ఆటోమొబైల్ సంస్థలకు షాకిచ్చినట్లు అయింది. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ట్రంప్ సుంకాల పెంపును తెరపైకి తీసుకొస్తున్నారు. ఇతర దేశాల నుంచి దిగుమతయ్యే ఏ వస్తువుపైన 25 శాతం సుంకం విధించనున్నట్లు గతంలోనే పేర్కొన్నారు.

### ప్రాణసంకటంగా ఆటోమొబైల్...

ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో విదేశీ ఆటోమొబైల్ సంస్థల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. యూఎస్‌కు ఎగుమతి చేయాలంటే అధికంగా పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఒకవేళ ధరలు పెంచితే వాహన అమ్మకాలు పడిపోయే ప్రమాదం ఉన్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అమెరికా మార్కెట్లో సరాసరి కారు ధర 49 వేల డాలర్లు ఉండగా, త్వరలో భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇతర దేశాల నుంచి దిగుమతయ్యే కారుపై విధిస్తున్న సుంకం 12,500 డాలర్లకు ఎగబాకనున్నది. ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో దేశీయ ఎగుమతులపై నీలినీడలు కమ్ముకోనున్నది. ప్రతియేటా భారత్ నుంచి 7 బిలియన్ డాలర్ల విలువైన కార్లు అమెరికాకు ఎగుమతి అవుతుండగా..తాజా నిర్ణయంతో ఆయా సంస్థలు వెనక్కితగ్గే అవకాశాలున్నాయి. ప్రధానంగా యూఎస్ మార్కెట్లో పాగావేసిన టాటా మోటర్స్ అనుబంధ సంస్థ జేఎల్‌ఆర్‌పై ఈ ప్రభావం అధికంగా పడనున్నది. బ్రిటన్ ప్లాంట్లో తయారైన జేఎల్‌ఆర్ వాహనాలను ప్రతియేటా లక్షల వాహనాలను అమెరికాకు ఎగుమతి చేస్తుండటమే ఇందుకు కారణం. సుంకాల పెంపు ప్రతిపాదనపై వాహన సంస్థలతోపాటు వాహన విడిభాగాల తయారీ





సంస్థలు కూడా ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఈ టారిఫ్ బాదుడుతో తమ ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం చూపనున్నాయని వారు వాపోతున్నారు. 2024లో భారత్ నుంచి 2.2 బిలియన్ డాలర్ల విడిభాగాలు అమెరికాకు ఎగుమతి అయ్యాయి.

### కుప్పకూలిన ఆటో షేర్లు...

ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో దేశీయ ఆటోమొబైల్ రంగ షేర్లు కుప్పకూలాయి. టాటా మోటర్స్ షేరు అత్యధికంగా 5.50 శాతం నష్టపోయింది. దీంతోపాటు అశోక్ లేలాండ్ 2.77 శాతం తగ్గగా, ఐచర్ మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, అపోలో టైర్స్ షేర్లు పతనం చెందాయి. మొత్తంగా ఆటో ఇండెక్స్ ఒక్క శాతం తగ్గి 48,220.85కి పడిపోయింది. వీటితోపాటు వాహన విడిభాగాల తయారీ సంస్థల షేర్లు కూడా ఒత్తిడికి గురయ్యాయి. సోనా బీఎల్‌డబ్ల్యూ షేరు 5.89 శాతం నష్టపోగా, సంవర్ధన్ మదర్‌సన్ ఇంటర్నేషనల్ 2.22 శాతం, భారత్ ఫోర్జ్ 2.30 శాతం, ఏఎస్‌కే ఆటోమోటివ్ లిమిటెడ్ 1.83 శాతం, రామ్‌కృష్ణ ఫోర్జింగ్స్ షేర్లు పతనం చెందాయి.

### సుంకాలను తగ్గిస్తాం: భారత్...

కొన్ని అమెరికా ఉత్పత్తులపై సుంకాలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తంచేసింది. అయితే అగ్రరాజ్యం అమెరికా ఒత్తిడికి తలొగ్గి ఈ నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టంచేశాయి. 23 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ప్రతియేటా భారత్ దిగుమతి చేసుకుంటున్నది. ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా దిగుమతి చేసుకునే వస్తువులపై టారిఫ్‌ను 55 శాతం వరకు తగ్గించడానికి భారత్ అంగీకరించినట్లు ప్రభుత్వ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి.

## హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ టాప్-10లో అంబానీకి దక్కని చోటు అదానీ ఏ స్థానంలో ఉన్నారంటే..!



హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2025 టాప్-10 సంపన్నుల జాబితాలో ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అబానీ స్థానం కోల్పోయారు. గత సంవత్సరంతో పోలిస్తే పెరిగిన అప్పుల కారణంగా అంబానీ సంపద రూ.లక్ష కోట్లు తగ్గింది. దాంతో ఆయన టాప్-10 నిష్క్రమించగా.. ఆసియాలో అత్యంత సంపన్నుడిగా తన స్థానాన్ని ఆయన నిలబెట్టుకున్నారు. ఈ జాబితాలో టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ అత్యంత సంపన్నుడిగా కొనసాగుతున్నారు. ఆయన మొత్తం సంపద ఊహించని విధంగా 82శాతం పెరిగి.. 420 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇక 266 బిలియన్ డాలర్ల సంపదతో అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ రెండోస్థానంలో ఉన్నారు. 242 బిలియన్ డాలర్లతో మెటా సీఈవో జుకర్‌బర్గ్ మూడో స్థానంలో ఉన్నారు. మరో వైపు రూ.3.5లక్షల కోట్ల సంపదతో హెచ్‌సీఎల్‌కు చెందిన రోష్నీ నాడార్.. టాప్-10 సంపన్న మహిళల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఆమె తండ్రి శివ్ నాడార్ ఇటీవల హెచ్‌సీఎల్ 47శాతం వాటాను ఆమె పేరిట బదిలీ చేయడంతో ఐదో స్థానానికి చేరుకున్నారు. టాప్-10 జాబితాలో చోటు కోల్పోయిన ముఖేశ్ అంబానీ.. ఆసియాలో సంపన్నుడిగా కొనసాగుతున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇంధన, రిటైల్ వ్యాపారాలతో ఇబ్బందిపడుతున్నది. నష్టాల నేపథ్యంలో రిలయన్స్ గ్రూప్ చైర్మన్ సంపద తగ్గింది. అలాగే, హురున్ జాబితాలో భారత్‌లో అంబానీ కుటుంబం తొలి స్థానంలో నిలిచింది. సంపద 13 శాతం తగ్గినా.. రూ.8.6 లక్షల కోట్లుగా ఉన్నది. ఆ తర్వాత గౌతమ్ అదానీ కుటుంబం రెండో స్థానంలో నిలిచింది. గత సంవత్సరంలో అదానీ నికర విలువ దాదాపుగా రూ.లక్ష కోట్లు పెరిగింది. ప్రస్తుతం అదానీ కుటుంబం ఆస్తులు రూ.8.4లక్షల కోట్లు. రోష్నీ నాడార్ కుటుంబం (రూ.3.5లక్షల కోట్లు), సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్‌కు చెంది దిలీప్ సంఘ్వీ కుటుంబం రూ.2.5 లక్షల కోట్లుగా ఉన్నది. ఆయన సంపద 21శాతం పెరగడంతో ఈ జాబితాలో ఐదోస్థానంలో నిలిచారు. అజీమ్ ప్రేమ్‌జీ కుటుంబం (రూ.2.2 లక్షల కోట్లు), కుమార మంగళం బిర్లా కుటుంబం (రూ.2.0లక్షల కోట్లు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. సైరస్ పూనావాలా కుటుంబం (రూ.2లక్షల కోట్లు), నీరజ్ బజాజ్ ఫ్యామిలీ (రూ.1.6 లక్షల కోట్లు), రవి జైపురియా కుటుంబం (రూ.1.4 లక్షల కోట్లు) , రాధా కిషన్ దమానీ కుటుంబం (రూ.1.4లక్షల కోట్లు)తో టాప్-10లో చోటు దక్కించుకున్నారు. గత సంవత్సరంలో పోలిస్తే బిలియనీర్ల సంఖ్య పెరిగి 284కు చేరింది. గతంలో బిలియనీర్ల జాబితాలో ఉన్న 27 మంది సంపద కోల్పోయినా.. మొత్తం సంపన్నుల సంఖ్య పెరగడం విశేషం. వీరి వద్ద మొత్తం ఉన్న సంపద రూ.98లక్షల కోట్లు. 90 మంది బిలియనీర్లతో ముంబయి అగ్రస్థానంలో కొనసాతున్నది. 'బిలియనీర్స్ క్యాపిటల్ ఆఫ్ ఆసియా' టైటిల్‌ని ముంబయి కోల్పోగా.. చైనాలో షాంఘై నగరం దక్కించుకున్నది.

## అమెరికాకు.. జీ హుజూర్ డిజిటల్ ట్యాక్స్ రద్దు..ఏప్రిల్ 1 నుంచే అమలు

**గూగుల్, ఎక్స్, మెటా, అమెజాన్ తదితర అమెరికా సంస్థలకు లాభం**

**ట్రంప్ టారిఫ్ ఒత్తిళ్లకు తలొగ్గుతున్న మోదీ సర్కారు**

**ఖజానా ఆదాయానికి వేల కోట్ల రూపాయల్లో గండి**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుకున్నది సాధిస్తున్నారు. ఇతర దేశాల సంగతెలా ఉన్నా.. భారత్ మాత్రం ట్రంప్ ఆంక్షలకు తలొగ్గింది. ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు ఉంటాయంటూ అగ్రరాజ్యాధినేత చేసిన హెచ్చరికలకు మోదీ సర్కారు బాగానే భయపడిపోతున్నది మరి. అమెరికా వస్తూత్పత్తులపై ఇప్పటికే దిగుమతి సుంకాలను మినహాయించడం లేదా తగ్గిస్తూ వచ్చిన కేంద్రం.. ఇప్పుడు అక్కడి టెక్ కంపెనీలకూ భారీ లాభాల్ని కట్టబెడుతూ డిజిటల్ ట్యాక్స్‌ను రద్దు చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధికారికంగా ప్రకటించారు. ఏప్రిల్ 1 నుంచి 'గూగుల్ ట్యాక్స్'గా పాపులరైన ఈ డిజిటల్ ట్యాక్స్‌ను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు చెప్పేశారు.

### వేల కోట్లలో నష్టం...

2016 జూన్ 1న ఆన్‌లైన్ అడ్వర్టైజింగ్‌పై డిజిటల్ ట్యాక్స్ లేదా లెవలింగ్ ఫీ, ఈక్వలైజేషన్ లెవీని కేంద్రం తీసుకొచ్చింది. అంతేగాక 2020లో ఈ పన్ను పరిధిని మరింతగా విస్తరించింది. దేశీయంగా ఎలాంటి కార్యకలాపాలు లేకున్నా భారతీయ వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున ఆదాయాన్ని దక్కించుకుంటున్న గూగుల్, ఎక్స్, మెటా, అమెజాన్ తదితర విదేశీ డిజిటల్ సంస్థలే లక్ష్యంగా 6 శాతం పన్నును విధించారు. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లోనే దీనిద్వారా కేంద్రానికి దాదాపు రూ.3,343 కోట్ల ఆదాయం రావడం గమనార్హం. అయితే ట్రంప్ సర్కారు తమ దేశ టెక్నాలజీ సంస్థలపై అడ్డగోలుగా భారత్ పన్నులు వేస్తోందని మండిపడుతున్నది. ప్రతీకార సుంకాల హెచ్చరికల సందర్భంగా ఈ విషయాన్ని నొక్కిచెప్పింది కూడా. ఈ నేపథ్యంలో ఆర్థిక బిల్లు 2025కి చేసిన 59 సవరణల్లో ఈ డిజిటల్ ట్యాక్స్‌ను ఎత్తివేస్తున్నట్లు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చెప్పింది. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఈ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగగా, వచ్చే నెల మొదలు ఈ పన్నుకు బ్రేక్ పడనున్నది. ఇదే జరిగితే గూగుల్, మెటా, ఎక్స్, అమెజాన్ వంటి అమెరికా సంస్థలకు వేల కోట్ల రూపాయలు అప్పనంగా మిగిలినట్టే. ఇదే సమయంలో ఖజానా ఆదాయానికీ గండి పడ్డట్టే. నిజానికి లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టేటప్పుడు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి మాట్లాడుతూ.. గత ఏడాదే ఈ-కామర్స్ లావాదేవీలపై 2 శాతం లెవలింగ్ ఫీజును తొలగించామని, ఇప్పుడు ఆన్‌లైన్ ప్రకటనలపై పడుతున్న 6 శాతం డిజిటల్ ట్యాక్స్‌నూ ఎత్తివేస్తున్నామని గొప్పగా చెప్పుకొచ్చారు. తద్వారా మన చట్ట సభల నుంచే అమెరికాను మెప్పించే ప్రయత్నం మోదీ సర్కారు చేసేసింది.

### ట్రంప్ భేటీలోనే..

గత నెలలో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు ఆ దేశాధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 2030కల్లా ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేర్చాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అయితే మేము ప్రతీకార సుంకాలకు దిగితే భారత్‌పైనా ఆ ప్రభావం ఉంటుందని ట్రంప్ అన్నారు. ఈ నేపథ్యంలో మోదీ.. వచ్చీరాగానే కొన్నింటిపై సుంకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకుని కోతలు పెట్టారు.

### నిపుణుల మాటేంటి?

భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న జనరిక్ ఔషధాలతో అమెరికన్ల వైద్య ఖర్చులు 60 నుంచి 70 శాతం తగ్గుతున్నాయని ఆర్థిక విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. అలాంటప్పుడు వీటిపై సుంకాలు వేస్తే అక్కడి ప్రజానీకానికే ఇబ్బందని అంటున్నారు. ఇక అమెరికా ప్రయోజనాల కోసం మన ఆదాయాన్ని వదులుకోవాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని అంటున్నావారూ ఉన్నారు. ఐటీ, ఆటో, స్టీల్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలకు వచ్చిన ఇబ్బందేమీ లేదని, ప్రపంచ దేశాలు అమెరికాతో ఎలా వ్యవహరిస్తున్నాయో.. అలాగే భారత్ కూడా ఉండాలని సూచిస్తున్నారు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332